
ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు వైసీపీ ప్రభుత్వం స్వస్తి



- విద్యాదీవెన అమలు
- విద్యార్థి తల్లి ఖాతాకు డబ్బు జమ చేస్తామని ప్రకటన
- నెలలు గడుస్తున్నా అందని సొమ్ము
- ఫీజు చెల్లించాలని యాజమాన్యాల ఒత్తిళ్లు
- అప్పోసప్పో చేసి చెల్లిస్తున్న తల్లిదండ్రులు
- వసతి దీవెనలో కత్తెర




దీవెన కాదు.. వేదన..!



రీయింబర్స్‌మెంట్‌కు స్వస్తి

నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించే ఉద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఈ విధానంలో ప్రైవేటు కళాశాలల్లో చదువుకునే విద్యార్థుల ఫీజును యాజమాన్యాలకు ప్రభుత్వమే చెల్లిస్తూ వస్తోంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఈ పథకంలో మార్పులు చేయలేదు. వైసీపీ అధికారం చేపట్టాక కాలేజీలకు నేరుగా ఫీజు చెల్లించే విధానానికి స్వస్తి పలికింది. జగనన్న విద్యాదీవెన పేరుతో 2020-21 విద్యాసంవత్సరం నుంచి ఫీజు సొమ్మును విద్యార్థి తల్లి ఖాతాకు జమచేయడం ప్రారంభించింది. వారు ఆ డబ్బును డ్రా చేసి, కళాశాలకు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి డబ్బు వేయడం వల్ల రాజకీయంగా తమకు ప్రయోజనం ఉంటుందని అధికార పార్టీ భావించింది. ఈ నూతన విధానం విద్యార్థులకు అనేక చిక్కులు తెచ్చి పెట్టింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం ఉన్నపుడు కాలేజీలకు ప్రభుత్వం ఫీజులు చెల్లించిందా? లేదా? అనే విషయంతో విద్యార్థులకు సంబంధం ఉండేదికాదు. విద్యార్థుల వద్ద యాజమాన్యాలు ఫీజుల ప్రస్తావన తెచ్చేవి కాదు. చెల్లింపుల్లో ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం, కళాశాలల యాజమాన్యాలు చూసుకునేవి.



ధర్మవరం, ఏప్రిల్ 22: ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు చెల్లింపుల సమస్యే ఉండేది కాదు. ప్రభుత్వం నేరుగా కాలేజీలకే ఫీజు సొమ్ము చెల్లించేది. విద్యార్థులు ప్రశాంతంగా చదువుపై దృష్టి పెట్టేవారు. తల్లిదండ్రులకు ఫీజుల చెల్లింపు సమస్యే ఉండేది కాదు. వైసీపీ అధికారం చేపట్టాక ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి స్వస్తి పలికింది. ఆ డబ్బు విద్యార్థుల తల్లుల ఖాతాకు జమచేస్తే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని ఎత్తు వేసింది. అందులో భాగంగా జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేసింది. తొలి రెండు విడతలు మాత్రమే విద్యాదీవెన సొమ్ము సమయానికి జమ చేసింది. ఆ తరువాత డబ్బు జమ చేసినట్లు సీఎం జగన్ ప్రకటించినా.. నెలల తరబడి లబ్ధిదారులకు అందదు. ఆ తరువాత విద్యాదీవెన విడతలనే ఎగ్గొట్టారు. సకాలంలో ఫీజు సొమ్ము అందకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు.. విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. ఫీజు చెల్లిస్తేనే విద్యార్థిని పరీక్షలకు అనుమతిస్తామంటూ తెగేసి చెబుతున్నాయి. దీంతో నిరుపేదలైన విద్యార్థుల తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. అప్పో.. సప్పో.. చేసి ఫీజులు చెల్లిస్తున్నారు. ఫీజుల కోసం యాజమాన్యాల ఒత్తిళ్లతో విద్యార్థులు కూడా చదువులపై దృష్టి పెట్టలేకపోతున్నారు.

ఎప్పుడు జమవుతుందో..?





కాలేజీకి చెల్లించాల్సిన ఫీజును ఏడాదికి నాలుగు విడతల్లో విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. 2020-21లో మాత్రమే దీనిని పక్కాగా అమలు చేసింది. నాలుగు విడతలు చెప్పినట్టుగా జమ చేసింది. ఆ తరువాతి విద్యాసంవత్సరం నుంచి ముందుగా ప్రకటించిన షెడ్యూల్ (మూడు నెలలకోసారి) కంటే రెండు, మూడు నెలలు ఆలస్యంగా ఫీజు సొమ్ము జమ చేసింది. దీంతో కాలేజీ యాజమాన్యాల నుంచి ఫీజు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిడి పెరిగింది. ప్రభుత్వం ఫీజు చెల్లించకపోయినా ఇంజనీరింగ్, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ కట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

వందలాది మందికి నష్టం



నాలుగు విడతల్లో విద్యాదీవెన సొమ్ము విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. రెండేళ్లుగా మూడుసార్లు మాత్రమే ఇస్తూ వచ్చింది. రెండు విడతల ఫీజు సొమ్మును ప్రభుత్వం బకాయి పడింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్కొక్కరికి ఒక్కోలా ఫీజులు జమజేసింది. కొందరికి ఒకటి, మరికొందరికి రెండు విడతలు జమ కాలేదు. ఎప్పుడు జమవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఫీజు కట్టాలంటూ కాలేజీల నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పోసప్పో చేసి ఫీజు కట్టి, పిల్లలను పరీక్షలకు పంపుతున్నారు. ప్రతి విడతలోనూ సాంకేతిక అంశాలు, ఇతర సాకులను చూపుతూ ఎంతోమంది విద్యార్థులను అనర్హులుగా చూపిస్తూ ప్రభుత్వం కోత విధించింది. ఇలా గత నాలుగేళ్లలో కనీసం ఒక్కో విడత సొమ్మును కోల్పోయిన విద్యార్థులు వేలల్లో ఉన్నారు.

భారీగా విద్యార్థులు

డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్ వంటి కోర్సుల విద్యార్థులకు విద్యాదీవెన పథకం వర్తిస్తోంది. ఏటా అయా కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య వేలల్లోనే ఉంటోంది. విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లోనూ ప్రభుత్వం కోత విధించింది. ఏటా రూ.20వేలు చొప్పున స్కాలర్‌షిప్ చెల్లిస్తామని ప్రకటించింది. దీనికి కూడా ప్రభుత్వం జగనన్న వసతి దీవెన అనే పేరు పెట్టింది. 2020-21, 2021-22 విద్యాసంవత్సరంలో మాత్రమే చెప్పినట్లు ప్రభుత్వం విద్యార్థులకు వసతి దీవెనను రెండు విడతల్లో చెల్లించింది. గత రెండేళ్లు ఒక విడత చొప్పున మాత్రమే జమ చేసింది. అంటే ఒక్కో విద్యార్థికి రూ.10వేలు చొప్పున రూ.20వేలు కోత పెట్టింది. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా, వసతి దీవెన పథకాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి తల్లిదండ్రులకు ఆర్థిక కష్టాలు తప్పట్లేదు.



బీఫారం అందుకున్న కందికుంట

కదిరి, ఏప్రిల్ 22: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కదిరి నియోజకవర్గ అభ్యర్థి కందికంట వెంకటప్రసాద్‌కు తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సోమవారం బీఫారం అందజేశారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలో చంద్రబాబును కందికుంట కలిసి, బీఫారం అందుకున్నారు. ఎన్నికల్లో విజయం సాధించాలని చంద్రబాబు దీవించినట్లు కందికుంట తెలిపారు. ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీకి వస్తానని చంద్రబాబుకు కందికుంట చెప్పినట్లు సమాచారం.


చంద్రబాబు నుంచి బీఫారం అందుకుంటున్న కందికుంట వెంకటప్రసాద్

వైసీపీకి భారీ షాక్

కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటిసూర్యప్రకాశ్‌బాబు రాజీనామా

ఆయన భార్య, జడ్పీటీసీ సుధ కూడా..

కేతిరెడ్డి బీసీల ద్రోహి అంటూ ధ్వజం


మాట్లాడుతున్న కోటిసూర్యప్రకాశ్‌బాబు

బత్తలపల్లి, ఏప్రిల్ 22: వైసీపీకి భారీ షాక్ తగిలింది. పార్టీకి కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటిసూర్యప్రకాశ్ బాబు కుటుంబం రాజీనామా చేసింది. పార్టీతోపాటు పదవికి ఆయన రాజీనామా చేశారు. ఆయన భార్య, బత్తలపల్లి జడ్పీటీసీ కోటిసుధ, ఎంపీటీసీ నరేశ్, ఉపసర్పంచ్ గోపి కూడా పార్టీకి రాజీనామా చేశారు. బత్తలపల్లిలోని తన నివాసంలో సోమవారం రాత్రి విలేకరుల సమావేశంలో కోటి సూర్యప్రకాశ్ బాబు మాట్లాడారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బీసీల ద్రోహి అని ధ్వజమెత్తారు. తన సామాజికవర్గాన్ని కోటరీగా ఏర్పరచుకుని, బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. 1995 నుంచి తాము కేతిరెడ్డి కుటుంబం వెంట నడిచామన్నారు. వారి విజయానికి కష్టపడి పని చేశామన్నారు. ఆస్తులు అమ్ముకుని, పార్టీ కోసం పనిచేశామన్నారు. అయినా తమను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎంపీ పదవి రెండుసార్లు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఒకసారి గోరంట్ల మాధవ్‌కు, ఈసారి కర్ణాటక వాసి శాంతకు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం ఆస్తులు పోగొట్టుకుని, పనిచేసిన తమ కుటుంబాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి సర్వనాశనం చేశారన్నారు. బీసీల సమస్యలను ఆయన ఏనాడూ పట్టించుకున్న పాపానపోలేదన్నారు. పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. తన తండ్రి హయాం నుంచి మఠం ఆస్తి కోట్లాది రూపాయల విలువచేసే భూమిని కేతిరెడ్డి అనుచరులు ఫోర్జరీ సంతకాలతో కబ్జా చేశారని ఆరోపించారు. విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా న్యాయం చేయలేదన్నారు. సొంత పార్టీ వారు కబ్జాలు చేసినా కేతిరెడ్డి పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెంది, వైసీపీకి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం సత్యకుమార్ నామినేషన్ కార్యక్రమానికి వస్తున్న సినీనటుడు సాయికుమార్ సమక్షంలో బీజేపీలోకి చేరుతున్నట్లు ఆయన తెలిపారు.

ఎంఎస్ రాజు నామినేషన్


ఎంఎస్ రాజు తరపున నామినేషన్ సమర్పిస్తున్న గుండుమల, టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, ఏప్రిల్ 22: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి మడకశిర అభ్యర్థిగా ఎంఎస్‌రాజు తరఫున సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. మడకశిర నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్ప, స్వతంత్ర అభ్యర్థులుగా డాక్టర్ సునీల్‌కుమార్, టి.ధనరాజ్ నామినేషన్ వేశారు.

పురం వైసీపీలో రెబెల్

రెబల్ అభ్యర్థిగా రెడ్డి సంఘం నేత నామినేషన్

హిందూపురం, ఏప్రిల్ 22: పురం వైసీపీలో రెబెల్ మోగింది. అధికార పార్టీ రెబల్ అభ్యర్థిగా ఆ పార్టీ నాయకుడు, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు సడ్లపల్లి వెంకటేశ్ రెడ్డి సోమవారం హిందూపురం అసెంబ్లీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. వందలాది మంది రెడ్డి కులస్థులతో కలిసి పేట వెంకటరమణస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం వైసీపీ తరఫునే పోటీ చేస్తున్నట్లు నామినేషన్ పత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ స్థానిక నాయకత్వంపై విసుగు చెందానన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి అటకెక్కిందన్నారు. ఈ కారణాలతో రెబల్‌గా బరిలో దిగుతున్నానన్నారు. వైసీపీ బీఫారం ఇవ్వకపోతే రెబల్ అభ్యర్థిగా పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. వెంకటేశ్‌రెడ్డి నామినేషన్‌కు వందలాది మంది రావడం అధికార పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైసీపీ ప్రస్తుత సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డికి వెంకటేశ్ రెడ్డి దగ్గర బంధువు కావడం, రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంతో ఒక్కసారిగా వారు ఆలోచనలో పడ్డారు. ర్యాలీలో పాల్గొన్నవారు వైఎస్ఆర్ రెబల్ అంటూ జెండాలపై రాసి, చేతబట్టుకుని రావడం కొసమెరుపు.


నామినేషన్ దాఖలు చేస్తున్న వెంకటేశ్ రెడ్డి

టాప్‌లేపారు..!

పది ఫలితాల్లో ప్రభుత్వ బడుల విద్యార్థుల హవా.. జిల్లా టాపర్లుగా సత్తా

కొత్తచెరువు, ఏప్రిల్ 22: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో టాప్‌లేపారు. జిల్లా టాపర్లుగా నిలిచారు. జిల్లాలోని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలకు చెందిన ఎం.మహేశ్‌బాబు (596/600), గుడిబండ మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ పాఠశాలకు చెందిన జీ.గోపిక (596/600), గోరంట్ల చైతన్య పాఠశాలకు చెందిన యువకిశోర్‌రెడ్డి(596/600) సంయుక్తంగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ధర్మవరంలోని బీఎస్ఆర్ బాలుర మున్సిపల్ పాఠశాలకు చెందిన డీ.యశ్వంత్ (593/600), జి.సాగర్ (593/600) మార్కులతో జిల్లాలో ద్వితీయస్థానంలో నిలిచారు. బుక్కపట్నం ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన సౌమ్య (592/600), పుట్టపర్తి మండలం ఎనుములపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముషీరత్ (592/600) తృతీయస్థానంలో నిలిచారు. ఆ విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. జిల్లావ్యాప్తంగా 2023-24 సంవత్సరానికిగాను 21,809 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 18,419 మంది ఉత్తీర్ణులయ్యారు. 84.46 శాతంతో రాష్ట్రంలో 20వ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా నిలిచింది. గత విద్యాసంవత్సరంలో 61.81 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 22.65 శాతం పెరిగి 84.46 శాతం సాధించారు. పది ఫలితాల్లో బాలికలదే పైచేయి. జిల్లాలో 25 ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం.


మహేశ్ బాబు (596)


గోపిక (596)


సౌమ్య (592)

పెనుకొండ విద్యార్థిని అదుర్స్

పెనుకొండ మండలం చిన్నరెడ్డిపల్లికి చెందిన తన్నేరు ప్రణతి పదో తరగతిలో 598 మార్కులు సాధించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన సత్యనారాయణరెడ్డి, హేమావతి దంపతుల కూతురు ప్రణతి. అనంతపురం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో చదివింది. ఫస్ట్ లాంగ్వేజ్‌లో 100, సెకెండ్ లాంగ్వేజ్‌లో 99, థర్డ్ లాంగ్వేజ్‌లో 100, గణితంలో 100, సైన్స్‌లో 99, సోషల్‌లో 100 మార్కులు సాధించింది.


ప్రణతి (598)

వైసీపీ నాయకుడి కోడ్ ఉల్లంఘన

మంత్రి వస్తున్నారని అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసిన అధికారులు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 22: వైసీపీ నాయకుడికి ఎన్నికల కోడ్ పట్టలేదు. అధికారం ఉంది కదా అని ఏకంగా అభివృద్ధి పనులకే శ్రీకారం చుట్టాడు. పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ సబిహా భర్త, వైసీపీ నాయకుడు యాసీన్ ఎన్నికల కోడ్ ఉన్నా సౌదాగర్‌వీధిలో ఎక్స్‌కవేటర్‌తో సోమవారం అభివృద్ధి పనులు చేపట్టాడు. మంత్రి ఉషశ్రీ ప్రచారానికి వస్తుండడంతో స్థానికులు ప్రశ్నిస్తారని తెలుసుకున్న యాసీన్ అప్పటికప్పుడు ఎక్స్‌కవేటర్‌తో అభివృద్ధి పనులు చేపట్టాడు. ఐదేళ్లుగా సౌదాగర్‌వీధిలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేయని నాయకులు ఎన్నికల వేళ చేపట్టడంపై స్థానికులు మండిపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న ఎన్నికల అధికారి వంశీకృష్ణ భార్గవ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అభివృద్ధి పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసి, కౌన్సిలర్‌కు నోటీసులు అందించారు.


ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తున్న దృశ్యం

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 26.0	40.0 26.0	41.0 27.0	38.0 24.0	37.0 26.0

ఊరంతా వనాలకు..




వనంలో పిండివంటలు చేస్తున్న మహిళలు, శ్రీరాముని చిత్రపటంతో ఊరేగింపు

ధర్మవరం మండలంలోని చిగిచెర్ల గ్రామం మొత్తం సోమవారం ఖాళీ అయింది. ఒక్కరూ లేరు. ఊరి జనం.. పిల్లాపాపలతో వంట సామగ్రి, సరుకులతో ఉదయాన్నే వనభోజనాలకు వెళ్లారు. వనాల్లో వంటలు వండుకుని, అక్కడే భోజనాలు చేశారు. పిల్లాపాపలతో హాయిగా ఆటలు ఆడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటే గడిపారు. ఏటా శ్రీరామనవమి తర్వాత వనభోజనాలకు వెళ్లడం గ్రామంలో ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే అందరూ గ్రామాన్ని వదిలి, శ్రీరాముని చిత్రపటం ఊరేగింపుగా పిండివంటల సరుకులను గంపలో ఎత్తుకుని వనంలోకి వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి పిండి వంటలు చేసుకుని, కుటుంబసభ్యులతో కలిసి ఆరగించారు. వనంలో యువతులు, మహిళలు ఊయలలు ఊగుతూ సంబరంగా గడిపారు. యువకులు కేరింతలతో ఉత్సాహంగా గ్రామీణ క్రీడలతో అలరింపజేశారు. సాయంత్రం శ్రీరాముని పటంతో ఊరేగింపుగా గ్రామంలోకి చేరుకున్నారు. -ధర్మవరంరూరల్


వన భోజనాలకు వెళ్తున్న గ్రామస్థులు

జన కేతనం

ఆంధ్రజ్యోతి

ఏమైతే అది కానీ..

వైసీపీ ప్రచారకర్తలుగా వలంటీర్లు

వలంటీర్ గ్రూపులను వైసీపీ గ్రూపులుగా మార్చిన వైనం

ఆయా గ్రూపుల్లో ప్రచార ఫొటోలు, వీడియోల పోస్టింగ్

ఎన్నికల నిబంధనలకు తూట్లు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 22: ఎన్నికల వేళ వలంటీర్ల గ్రూపులన్నీ వైసీపీ ప్రచార గ్రూపులుగా మారాయి. ఇందులో అభ్యర్థుల గురించి ప్రచారం. ఆయనే గెలుస్తారని చెప్పిన అభిప్రాయాల వీడియోలను గ్రూపుల్లో పోస్టు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ప్రచారం అనంతపురం నగరంలో జరుగుతోంది. చాపకింద నీరులా వాట్సాప్ గ్రూపుల్లో తరచూ మెసేజ్‌లు చేస్తూ వైసీపీ అభ్యర్థి అనంతవెంకటరామిరెడ్డి అనుచరులకంటే దారుణంగా పనిచేస్తున్నారు. ఎన్నికలకు సంబంధించి రాజకీయ నాయకులకు సహకరించకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చినా వలంటీర్లు వాటిని పెడచెవిన పెడుతున్నారు. మొదట్లో 50 ఇళ్లకు సంబంధించిన కుటుంబసభ్యులను ఒక గ్రూప్‌గా చేర్చి, అందులో వలంటీరు, సచివాలయ అడ్మిన్ ఉండేలా చేశారు. ప్రస్తుతం ఆ గ్రూపులోనే ఇలాంటి మెసేజ్‌లు, వీడియోలు ప్రచార రూపంలో ఊపందుకుంటున్నాయి. సోమవారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్‌కు సంబంధించి విచ్చలవిడిగా ప్రచారం చేశారు.



ఆ గ్రూపుల్లో వలంటీర్లు చేస్తున్న మెసేజ్‌లు ఇవే

అడ్మిన్‌లు ఏం చేస్తున్నట్లు...?

వలంటీర్లు విచ్చలవిడిగా మెసేజ్‌లు చేస్తుంటే సచివాలయ అడ్మిన్‌లు ఏం చేస్తున్నారనే అనుమానం కలుగుతోంది. అయితే అడ్మిన్ల చర్యలు సైతం వారిని మరింత ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల మేరకు అధికారిక గ్రూపుల్లో ఇలాంటి మెసేజ్‌లు చేయకూడదు. కానీ సచివాలయ అడ్మిన్లు వాటిని తొలగించడం లేదు. దీన్ని బట్టి చూస్తే కొందరు సచివాలయ అడ్మిన్‌లు సైతం వైసీపీ నేతలకు భరోసా ఇచ్చినట్లు కనిపిస్తోంది.

ప్రచారకర్తలుగా వలంటీర్లు

సంక్షేమ పథకాలు అందించడానికే ఉండాల్సిన వలంటీర్లు ఇప్పుడు వైసీపీ ప్రచారకర్తలుగా మారారు. అనంతపురంలో ఈ వ్యవహారం బాగా ముదిరిపోయింది. వలంటీర్లు ఇప్పుడు వైసీపీ అభ్యర్థులకు అంతరంగికులుగా మారారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించినా బేఖాతరు చేస్తున్నారు. ఒకే రోజు 18 మంది వలంటీర్లు పాల్గొన్నారు. కానీ అధికారులు ఇద్దరినే తొలగించారు. గత నెలలో వలంటీర్లే గ్రూపుల్లో వైసీపీ కార్యక్రమాలు, అభ్యర్థి గురించి ఎవరైనా గొప్పగా చెప్పిన మాటలు వీడియో రూపంలో పోస్టు చేశారు. తాజాగా నామినేషన్ ర్యాలీ, నామినేషన్ కార్యక్రమం వీడియో, ఫొటోలు గ్రూపులో మెసేజ్ చేస్తున్నారు. దీనికితోడు 50మందితోనే ఉన్న కొన్ని గ్రూపుల్లో కొత్త వారిని చేరుస్తున్నారు.



వాట్సాప్ గ్రూపులో కొత్త వారిని చేర్చేందుకు వలంటీర్లు ఇలా

పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



అడిగినా పని కల్పించని ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రచారం పట్ల ఆసక్తి...కరువు పనులపై నిర్లక్ష్యం

జిల్లాలో తగ్గిన పని దినాలు, కూలీలు

కనీస వసతులు కల్పించడంలో అశ్రద్ధ

ఉపాధికి ఎన్నికల ఫీవర్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 22: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలపై ఎన్నికల ప్రభావం పడుతోంది. ఎన్నికల నేపథ్యంలో కూలీలకు ఉపాధి పనులు కల్పించడంపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. జాబ్‌కార్డు ఉన్న కూలీలకు పనులు కల్పించాల్సిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారపార్టీకి ప్రచార కర్తలుగా పని చేస్తున్నారు. దీంతో ఉపాధి కూలీల సంఖ్యను తగ్గించి పని భారాన్ని తగ్గించుకోవాలని మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈక్రమంలోనే బయోమెట్రిక్, ఆధార్ ఆధారిత బ్యాంకు అకౌంట్లకు వేతనాల చెల్లింపులు, ఫేసియల్ యాప్ అంటూ నిబంధనలు విధిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. జాబ్‌కార్డుల సంఖ్యను పెంచకుండా తగ్గించడంతో పాటు పనిదినాలు తగ్గించడం, దినసరి సగటు వేతనాల్లో కోతలు విధించడం వంటి చర్యలన్నీ పథకాన్ని ఆటకెక్కించేందుకే అనే అనుమానాలు కలిగిస్తున్నాయి. గతంలో ఈ సమయానికి 40వేలకు పైగా పనిదినాలు నమోదు అయ్యాయి. ప్రస్తుతం 20వేలలోపు ఉపాధి కూలీల పనిదినాలు నమోదవుతున్నాయి. జిల్లాలో ఉన్న 4.5లక్షల జాబ్‌కార్డులకు 100 రోజుల పనిదినాలు కల్పించాలంటే 2కోట్ల పనిదినాలు అవసరం ఉంది. అయితే జిల్లాకు ఈ ఏడాది 80లక్షలు పని దినాలు మాత్రమే కేటాయించారు. దీంతో ఉపాధి కూలీలకు పనిదినాలతో పాటు దినసరి కనీస వేతనంపై కోతలు పడే ప్రమాదం ఉంది.



ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలనలకు వెళ్లిన కలెక్టర్ వినోద్‌కుమార్ వద్ద తమ గోడును వెళ్లబోసుకుంటున్న ఉపాధి కూలీలు

అన్నీ కోతలే..!

ప్రతి ఏటా ఉపాధి కూలీల సంఖ్యను తగ్గిస్తూ వస్తున్నారు. 2019లో ఉమ్మడి జిల్లాలో 8.7లక్షల జాబ్ కార్డులు ఉండేవి. మొత్తం 12లక్షల మంది కూలీలు పనులు చేస్తుండేవారు. జిల్లా విభజనతో అనంత జిల్లాలో 4.5లక్షలు ఉండాలి. అయితే ప్రభుత్వం విధించిన కోతలతో ప్రస్తుతం 3.5లక్షలు జాబ్‌కార్డులు మాత్రమే ఉన్నాయి. ఇందులో 5లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరిలో 2లక్షల మందికి మాత్రమే పని కల్పిస్తున్నారు. 82రకాల పనులు ఉండగా.. వాటిలో కోతలు విధించి, ప్రస్తుతం 4రకాలు పనులు మాత్రమే కల్పిస్తున్నారు. అన్ని రాష్ట్రాల్లో ఉపాధి కూలీలకు చెల్లిస్తున్న దినసరి వేతనం కంటే జిల్లాలో అతితక్కువగా చెల్లిస్తున్నారు. హరియాణాలో అత్యధికంగా రూ.374 చెల్లిస్తుంటే...జిల్లాలో రూ.300 చెల్లిస్తున్నారు. దీనిపై కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో పనిచేసే చోట ఉపాధి కూలీలకు టెంట్లు (నీడ), మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ పాకెట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలి. అయితే ఎక్కడా ఈ వసతులు కల్పించిన దాఖలాలు లేవు.

18మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు

ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు పలువురిని టీసీలో పెడుతూ డ్వామా అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇందులో శింగనమల మండలం లోలూరు-అంజనరెడ్డి, ఆకులేడు-గంగాధర్, నాగుల గుడ్డం- భాస్కర్, చక్రాయపేట-రమణారెడ్డిలు ఉన్నారు. రాప్తాడు మండలంలో గాండ్లపర్తి- విజయశంకర్, బొమ్మేపర్తి-రమణారెడ్డిలు ఉన్నారు. కూడేరు మండలం మరుట్ల-బయ్యపురెడ్డి, డీ హీరేహళ్ మండలం పులకుర్తి- విజయ కుమార్, విడపనకల్లు మండలం-హవళిగి-మల్లికార్జున, పెద్దవడుగూరు మండలం గార్లదిన్నె-చిన్నకుళ్ళాయప్ప, చిన్నవడుగూరు- రాజ శేఖర్‌లను టీసీలో ఉంచారు. మరో ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల వివరాలను గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.



డ్వామా కార్యాలయం



అడిగినా పనులు కల్పించడంలేదు..

కరువు పని చూపించాలని ఫీల్డ్ అసిస్టెంట్, ఆఫీసర్లను అడిగినా పట్టించుకోవడం లేదు. ఏమని అడిగితే ఎన్నికలు ఉన్నాయంటూ వెళ్లిపోతున్నారు. పనులు లేక నానా అవస్థలు పడుతున్నాం. పూట గడవడమే కష్టంగా ఉంది. సేద్యం పనులు చేసుకుంటూ కూలికి పోదాం అనుకుంటే...అక్కడ కూడా పనులు లేవు. జాబ్‌కార్డు ఉంది. ఉపాధి పనులు కల్పిస్తే పనులు చేసుకుని జీవనం సాగిస్తాం.

- నారాయణమ్మ, కడవకల్లు గ్రామం, పుట్లూరు మండలం



పనులు కల్పించడానికి ప్రత్యేక ప్రణాళిక

ఎన్నికల ప్రభావం పడకుండా జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పక్కా ప్రణాళికలతో పనులు కల్పించడానికి ఇప్పటికే చర్యలు చేపట్టాం. పని అడిగిన ప్రతి కూలీకి స్థానికంగానే పనులు కల్పించాలని క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. ఇక వేసవిలో ఇచ్చే అలవెన్స్‌తో పాటు ఇతర వసతులు ఇవ్వడానికి టీసీఎస్ నుంచి ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లోకి మార్చడంతో సమస్య ఏర్పడింది. ఇందులో ఆన్‌లైన్ ప్రత్యేక వసతులకు సంబంధించి ఆప్షన్‌ను తొలగించారు. ఇది కొంతవరకు ఉపాధి కూలీలకు నిరుత్సాహం, నష్టం కలిగించే అంశం. అయినా దినసరి కూలీని పెంచి, పనిదినాలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- వేణుగోపాల్ రెడ్డి, డ్వామా పీడీ

గందరగోళం..!

పోస్టల్ బ్యాలెట్‌పై కొరవడిన స్పష్టత!

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లను దూరం చేసే కుట్ర

ఫారం-12 ఇస్తున్నా అక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వని అధికారులు

ఒకోసారి ఒకోలా మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారులు

అనుమానాలు వ్యక్తం చేస్తున్న 'ఎన్నికల ఉద్యోగులు'

అనంతపురం టౌన్, ఏప్రిల్ 22: పోస్టల్ బ్యాలెట్‌పై అధికారులు ఏ విషయం చెప్పడం లేదు. ఎప్పటి వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది? దరఖాస్తులు ఎక్కడ ఇవ్వాలి? ఆ దరఖాస్తులను ఓటు ఉన్న నియోజకవర్గానికి ఎలా పంపుతారు? దరఖాస్తు చేసుకున్న ఉద్యోగికి ఎలాంటి ఆధారాలు ఇవ్వాలి వంటి విషయాలపై అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు గందరగోళంలో పడిపోయారు. జిల్లాలో దాదాపు 25వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పీఓ, ఏపీఓలు, ఓపీఓలుగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. వీరిలో పోలీసులు కూడా ఉన్నారు. వీరందరూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారు. అలాగే 33 అత్యవసర సేవల శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కల్పించారు. ఇలాంటి సమయంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు యంత్రాంగం అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడం అనేక విమర్శలకు దారి తీస్తోంది. అధికార వైసీపీ పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. దీంతో ఆ ఉద్యోగ వర్గాల ఓట్లను దూరం చేయాలనే అధికార పార్టీనేతలు కుట్రలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అందుకే రిటర్నింగ్ అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ పోస్టల్ బ్యాలెట్ విషయంలో గందరగోళానికి గురిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

రోజుకో నిర్ణయంతో అనుమానాలకు బలం

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సేకరణ విషయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ప్రధాన పాత్ర పోషిస్తారు. అయితే జిల్లాలో ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై సరైన నిర్ణయాలు తీసుకొని చెప్పడం లేదు. ట్రైనింగ్‌లో ఓటు ఎక్కడ ఉన్నా తాము ఉద్యోగం చేస్తున్న నియోజకవర్గ ఆర్‌ఓలకు పోస్టల్ బ్యాలెట్ ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకొని అందించాలని ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు సూచించారు. ఈనెల 5, 7, 14 తేదీల్లో పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. అయితే అక్కడ ముందు చెప్పిన ప్రకారం దరఖాస్తులు తీసుకోకుండా ఆ నియోజకవర్గంలో ఓటు ఉన్నవారితో మాత్రమే ఫారం-12 దరఖాస్తు తీసుకున్నారు. మిగిలిన వారిని ఎక్కడ నివాసముంటున్నారో అక్కడే ఓటుకు దరఖాస్తు ఇమ్మన్నారు. అత్యధికమంది ఓటర్లు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనే ఉన్నారు. జిల్లాకేంద్రంలోని డీఆర్‌డీఏ ఆఫీస్‌లో కౌంటర్లు పెట్టి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఫారం-12 దరఖాస్తులు తీసుకున్నారు. ఓపీఓ డ్యూటీ పడిన వారు కూడా ఇక్కడే దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారికి అక్నాలెడ్జ్‌మెంటు ఇవ్వలేదు. ఇంకో వైపు శ్రీసత్యసాయి జిల్లాలో నాలుగు రోజుల కిందట ఓపీఓల డ్యూటీ ఆర్డర్లు ఇచ్చారు. అనంత జిల్లాలో మాత్రం వారం కిందట ఓపీఓల ఆర్డర్లు వచ్చాయి. ఆ ఆర్డర్లలోనే ఈనెల 15, 16 తేదీల్లో ఓటు ఉన్న నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఇచ్చారు. కానీ అందరివీ అనంతపురంలోనే తీసుకున్నారు. ఇప్పుడు శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న అనంత జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇక్కడే ఓట్లు ఉన్నాయి. వారు ఇపుడు ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక తికమక పడుతున్నారు.

అక్నాలెడ్జ్‌మెంటు ఇవ్వాలి

పోస్టల్‌బ్యాలెట్‌కు దరఖాస్తులపై ఉమ్మడి జిల్లాలో గందరగోళం కొనసాగుతోంది. రెండు జిల్లాల అధికారుల మధ్య సమన్వయలోపం వల్లే అనంత జిల్లాలో ఓరకంగా, శ్రీసత్యసాయి జిల్లాలో ఓరకంగా నిర్ణయాలు ఉంటున్నాయి. తొలుత ఆర్‌ఓలకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. ఇపుడు అనంతపురంలో డీఆర్‌డీఏ ఆఫీస్‌లో తీసుకుంటున్నారు. మేము దరఖాస్తులు ఇస్తున్నాం, కానీ మాకు అక్నాలెడ్జ్‌మెంటు ఇవ్వడంలేదు. ఇతర జిల్లాల్లో ఇస్తున్నా ఇక్కడ అడిగితే అలాంటిదేమీ లేదంటున్నారు. గతంలో పోస్టల్ బ్యాలెట్ జాబితాలో పేర్లు మిస్ అయిన సందర్భాలు ఉన్నాయి కాబట్టే అక్నాలెడ్జ్‌మెంట్ అడుగుతున్నాం.

- కోనంకి అశోక్ కుమార్, ఏపీటీఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు



నిస్సహాయ స్థితిలో నోడల్ ఆఫీసర్

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ వ్యవహారాలు చూసుకోవడం కోసం కలెక్టరు ఈవిభాగానికి డీపీఓను నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ఈనోడల్ ఆఫీసరు నిర్ణయాలు మేరకు ఆర్‌ఓలు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు స్వీకరించాలి. కానీ ఇక్కడ ఆర్‌ఓలు తమ సొంత ఎజెండాతో వెళుతున్నారని వారి నిర్ణయాల వల్లే జిల్లాలో గందరగోళం సాగుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి.

28 వరకు దరఖాస్తుకు అవకాశం: కలెక్టరు

ఎన్నికల నిర్వహణ, పోలింగ్ నిర్వహణలో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఈనెల 28 వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఉద్యోగి పనిచేసే ప్రాంతంలోని రిటర్నింగ్ అధికారులకు ఈ ఫారం ఇవ్వాలి. శిక్షణ సమయంలో కూడా ఫారం-12 ఇవ్వొచ్చు. ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఓటింగ్ అవకాశం కల్పిస్తాం. వారందరు ఓటు ఉన్న నియోజకవర్గంలో మే3 నుంచి 6వతేదీ వరకు ఓటు వేస్తారు. ఇందుకోసం ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు ఓటు వినియోగించుకోవచ్చు.

అన్ని నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలు ఉండాలి

అనుమానాలకు తావులేకుండా పోలింగ్‌నిర్వహణలో పాల్గొనే ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడికి ఓటు వేసేందుకు బ్యాలెట్ అవకాశం కల్పించాలి. అందరి నుంచి ఫారం-12 దరఖాస్తు తీసుకోవాలి. గతంలో మాదిరి అనంతపురంలో అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన ప్రత్యేక పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేసి ఇక్కడే ఓటు వేయించాలి. నియోజకవర్గంలోను పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి, అపుడే వందశాతం పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ నమోదుకు అవకాశం ఉంటుంది. ఆదిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

- రామాంజనేయులు, ఎస్టీయూ, జిల్లా ప్రధాన కార్యదర్శి



అభివృద్ధి చేసే వారికే ఓటు



- నాగమునెమ్మ, జూలాకాలవ

నియోజకవర్గం అభివృద్ధి చేసే పార్టీ అభ్యర్థికే ఓటు వేస్తా. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మా ప్రాంతాన్ని అభివృద్ధి చేసే నాయకుడినే ఎన్నుకుంటాం. విజన్ ఉన్నవారు గెలిస్తేనే మనకు అభివృద్ధి, సంక్షేమం దొరుకుతాయి. ఈసారి ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలి.

- శింగనమల

రచ్చకట్ట దగ్గర నిర్ణయం




- అశ్వత్థరెడ్డి, రిటైర్డ్ టీచర్, ఈస్టు నరసాపురం

ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే గ్రామానికి మంచి చేసేవారికే ఓటు వేయాలని భావించేవాళ్లం. అట్లా అనుకున్న తర్వాత గ్రామ పెద్దలు అందరు కలిసి గ్రామంలో ఓటుపై చర్చించాలని దండోరా వేసి రచ్చ కట్ట వద్దకు రమ్మనేవారు. అక్కడ అందరితో చర్చించి ఫలానా వ్యక్తికి ఓటు వేయాలని నిర్ణయం తీసుకునేవారు. ఆ తర్వాత ఏపెద్ద రెడ్డి, నాయుడు, నాయకులు వచ్చిన మేము ఫలానా వారికే ఓటు వేస్తామని తెగేసి చెప్పేవారు. ఇప్పుడు ఎవరి దగ్గర వారి మాట మాట్లాడుతున్నారు. డబ్బు, మందు, బిర్యానిలకు అమ్ముడుపోయి ఓటు వేస్తున్నారు. గెలిచిన వ్యక్తిని గ్రామం అభివృద్ధి చేయమని ఇంక ఎట్ల నిలదీయగలం.

- శింగనమల

ఒక పోలింగ్ స్టేషన్‌లో 14 వందల ఓట్లే..



కదిరిఅర్బన్, ఏప్రిల్ 22: ప్రస్తుత ఎన్నికల్లో ఓ పోలింగ్ స్టేషన్‌లో 14వందల మంది మాత్రమే ఓట్లు వేసేలా ఎన్నికల సంఘం ఓటరు జాబితా రూపొందించింది. దీనికి ఓ కారణముంది. ఈవీఎం లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ ఒకదానికొకటి అనుసంధానిస్తూ పనిచేసేలా ఏర్పాటు చేస్తారు. ఈవీఎంలో ఉండే వీవీ ప్యాట్‌లో థర్మల్ కాగితం పొందుపరుస్తారు. ఈకాగితం 15వందల స్లిప్పులను మాత్రమే ముద్రించగలుగుతుంది. 25.5 వోల్టుల సామర్థ్యం కలిగిన బ్యాటరీతో పనిచేసే వీవీ ప్యాట్‌లో ఓటు ఎవరికి పడిందనేది కనిపిస్తుంది. వీవీ ప్యాట్‌లో పొందుపరిచే థర్మల్ కాగితం స్లిప్పుల్లో 50 నుంచి వంద వరకు పోలింగ్ రోజున ఓటింగ్ ప్రారంభించడానికి ముందుగా నిర్వహించే మాక్ పోలింగ్‌కు ఉపయోగిస్తారు. 15వందల స్లిప్పుల్లో వంద మాక్ పోలింగ్‌కే అయిపోతాయి. 14వందల స్లిప్పులు మాత్రమే మిగిలి ఉంటాయి. అందుకే ప్రతి పోలింగ్ బూత్‌లో 14వందలకు మించి ఓటర్లు ఉండకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది.

అప్పుడు చెల్లని ఓట్లు... ఇప్పుడు నోటా



ధర్మవరం, ఏప్రిల్ 22: ఈవీఎంలు రాకముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగేది. బ్యాలెట్ పేపర్‌పై ఉన్న గుర్తులను సరిగా చూసుకొని ఓటరు తన ఇష్టమైన గుర్తుపై ఓటేసేవారు. అయితే నిరక్షరాస్యులు, వృద్ధులు అవగాహణ లేని కారణంగా బ్యాలెట్ పత్రంపై ఓటేసేటప్పుడు స్వస్తిక్ ముద్రను సరిగా వేసేవారు కాదు. దీంతో అలాంటి ఓట్లను చెల్లని ఓట్లుగా పరిగణించేవారు. ఈవీఎంలు వచ్చిన తరువాత ఇలాంటి సమస్యలేనప్పటికీ ఎన్నికల సంఘం నోటా(పైవారిలో ఎవరూ కాదు) అనే ఆప్షన్ ఇచ్చింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు ఓటేయడం ఇష్టం లేకపోతే చిట్ట చివరన ఉన్న నోటా బటన్‌పై నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటి సారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.

రాష్ట్రంలో గాలినిబట్టే గుంతకల్లులో గెలుపు

టీడీపీ ఆవిర్భావం నుంచి మారని సమీకరణం

గుంతకల్లు, ఏప్రిల్ 22: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ గాలి వీస్తుందో ఆ పార్టీ అభ్యర్థే గుంతకల్లు నియోజకవర్గంలో గెలవడం ఆనవాయితీగా ఉంది. 1983లో టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచీ ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ఆ పార్టీకి చెందిన అభ్యర్థే ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వస్తున్నారు. ఇప్పటికి (గుత్తి, గుంతకల్లు నియోజకవర్గాలు కలిపి) తొమ్మిది సార్లు ఎన్నికలు జరగ్గా అన్నిసార్లూ ఈ నియోజకవర్గం వేవ్ కాన్‌స్టిట్యూయన్సీగా నిలిచింది. తొమ్మిది ఎన్నికల్లో ఐదుసార్లు టీడీపీ, మూడుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసీపీ గెలుపొందాయి. ఈ మేరకే గుంతకల్లులో ఆయా పార్టీల అభ్యర్థులు కూడా ఎమ్మెల్యేలు అయ్యారు. వాటి వివరాలిలా.. పై వివరాలను బట్టి ఏ పార్టీ వేవ్ ఉంటే ఆ పార్టీ అభ్యర్థే గెలుపు సాధించారని అర్థమవుతోంది.

సం.	గెలిచిన అభ్యర్థి గుత్తి నియోజకవర్గంలో	పార్టీ	అధికారం పొందిన పార్టీ
1983	పత్తి రాజగోపాల్	టీడీపీ	టీడీపీ
1985	ఎన్ గాదిలింగప్ప	టీడీపీ	టీడీపీ
1989	అరికెరి జగదీశ్	కాంగ్రెస్	కాంగ్రెస్
1994	గాదిలింగప్ప	టీడీపీ	టీడీపీ
1999	సాయినాథ్ గౌడు	టీడీపీ	టీడీపీ
2004	ఎన్ సీలావతి	కాంగ్రెస్	కాంగ్రెస్
	గుంతకల్లు నియోజకవర్గంలో..		
2009	కె మధుసూదన్ గుప్త	కాంగ్రెస్	కాంగ్రెస్
2014	ఆర్ జితేంద్రగౌడు	టీడీపీ	టీడీపీ
2019	వై వెంకట రామిరెడ్డి	వైసీపీ	వైసీపీ

తొలిసారి ఇద్దరు సిటింగ్‌ల పోరాటం

గుంతకల్లు: ఒక నియోజకవర్గంలో ఇద్దరు సిటింగ్ ఎమ్మెల్యేలు పోటీపడటం గుంతకల్లు నియోజక వర్గంలో తొలిసారి చోటుచేసుకుంటోంది. ఆలూరు ఎమ్మెల్యేగా ఉన్న గుమ్మనూరు జయరాం గుంతకల్లు టీడీపీ అభ్యర్థిగా వలస రావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గుంతకల్లులో సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వై వెంకటరామిరెడ్డిని వైసీపీ అభ్యర్థిగా, ఆయనకు ప్రత్యర్థిగా గుమ్మనూరు జయరాం బరిలో నిలిచారు. ఇద్దరిలో ఎవరు గెలిచినా ఒకరు ఎమ్మెల్యే హోదాను నిలుపుకున్నవారతారు. గత ఎన్నికల్లో ఈ ఇద్దరు నాయకులూ భారీ మెజారిటీతో గెలుపొందిన విషయం తెలిసిందే.

'శింగనమల'... సెంటిమెంట్‌కు అడ్డా..!

ఇక్కడి విజేత పార్టీకే అధికారం... 8 సార్వత్రిక ఎన్నికల్లో అదే వరుస

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 22: ఎన్నికలు వచ్చినప్పుడల్లా సెంటిమెంట్ల ప్రస్తావన ఖచ్చితంగా వస్తుంటుంది. విస్తృతంగా చూసినపుడు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఏదో ఒక సెంటిమెంటు ఉంటుంది. సూక్ష్మంగా చూసినప్పుడు చాలా నియోజక వర్గాల్లో ఇదే వరుస ఉంటుంది. అలాంటిదే శింగనమల నియోజక వర్గ సెంటిమెంట్. శింగనమల నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందుతారో.. ఆ పార్టీనే అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ ఉంది. ఏకంగా 8 సార్వత్రిక ఎన్నికల్లో ఇదే తంతు కొనసాగుతుండడంతో రాష్ట్రంలోనే సెంటిమెంట్ నియోజకవర్గంగా గుర్తింపు పొందింది. 1978లో శింగనమల నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ అయింది. అప్పటి నుంచి ఈ నియోజకవర్గంలో గెలుపొందిన అభ్యర్థి పార్టీ అధికారంలోకి వస్తోంది. 1983లో టీడీపీ తరఫున గురుమూర్తి ఎమ్మెల్యేగా గెలుపొందగా ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైంది. 1985లో టీడీపీ తరఫున కె.జయరాం ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి పి. శమంతకమణి ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. 1994లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా కె.జయరాం గెలవగా టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. 2004, 2009 కాంగ్రెస్ నుంచి సాకే శైలజానాథ్ విజయం సాధించగా ఆ పార్టీనే అధికారంలోకి వచ్చింది. 2014లో టీడీపీ నుంచి యామినీబాల గెలవగా రాష్ట్రంలో అదే పార్టీ అధికారాన్ని కైవసం చేసుకుంది. 2019లో వైసీపీ నుంచి జొన్నలగడ్డ పద్మావతి విజయం సాధించగా అదే పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రస్తుత ఎన్నికల్లో ఏమి జరుగుతుందో చూడాలి.

మడకశిర నియోజకవర్గానికి ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేకత ఉంది. కర్ణాటక సరిహద్దుగా ఉండటంతో తెలుగు, కన్నడ సమ్మిళతంగా ఉంటుంది. ఇక్కడి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయి. మడకలపల్లి మడకశిరగా మారినట్లు చరిత్ర చెబుతోంది. హేమావతిలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయం దక్షిణకాశిగా వెలుగొందుతోంది. భక్తరహళ్లిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, జిల్లడగుంటలో ఆంజనేయసామి ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులు పాడి పరిశ్రమ, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వక్కసాగులో ప్రత్యేక స్థానం ఉంది. నియోజక వర్గంలో సుదీర్ఘకాలంగా సమస్యలు తాండవిస్తున్నా పాలకులు పట్టించుకోలేదు. సాగునీటి పథకం పనులు ఏళ్ల తరబడి పూర్తి కాకపోవడంతో తాగు, సాగు నీటికి జనం అవస్థలు పడుతున్నారు.

తెలుగు, కన్నడ సమ్మిళితం

నియోజకవర్గ చరిత్ర

భిన్న సంస్కృతుల మడకశిర
ఏళ్ల తరబడి వెంటాడుతున్న సమస్యలు
తాగు,సాగు నీటి కోసం ఎదురుచూపులు
బండబారిపోతున్న వేలాది ఎకరాలు

మడకశిర, ఏప్రిల్ 22 : తెలుగు, కన్నడ సమ్మిళత ప్రాంతం మడకశిర. కన్నడ సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడ కన్నడ సంప్రదాయాలు ఎక్కువగా కనిపిస్తాయి. చరిత్ర ప్రకారం మడకలపల్లి నేడు మడకశిరగా మారింది. మడకశిరను మైసూరు శిర నాయకలు కట్టించారు. బీజాపూరు రాజుల దండయాత్ర వల్ల రాజ్యాన్ని కోల్పోయిన వీరికి ప్రత్యామ్నాయంగా రత్నగిరి మడకశిర ఇచ్చారు. 1520లో స్థానిక నాయకుడు రత్నగిరి సర్జప్ప రాజా అడవిని చదును చేసి ఇక్కడ గ్రామాన్ని, ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారని కథనం. మడకశిర నియోజకవర్గం 1952 లో ఏర్పడింది. నియోజకవర్గంలో 326 గ్రామాలు ఉన్నాయి. రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాలు ఉన్నాయి. అమరాపురం మండలం హేమావతిలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయం దక్షిణకాశిగా వెలుగొందుతోంది. మడకశిర మండలం భక్తరహళ్లిలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంటలో వెలసిన ఆంజనేయసామి ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులు పాడిపరిశ్రమ, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మొదటి నుంచి ఈ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది.


హెంజేరు సిద్దేశ్వరస్వామి

ప్రధాన సమస్యలు

మడకశిర నియోజకవర్గంలో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. సాగునీటి పథకం పనులు పూర్తి కాకపోవడంతో తాగు, సాగు నీటికి జనం అవస్థలు పడుతున్నారు. వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతినడం, భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్లు అడుగంటిపోయి వేలాది ఎకరాలు బీడుగా మారి బండబారిపోతున్నాయి. తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరై పనులు 90 శాతం పూర్తయినా ఆ కాస్త పనులను కూడా ఈ ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వేసవిలో సాగు,తాగు నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. నియోజకవర్గంలో ఎటువంటి సాగు నీటి వనరులు లేక పోవండతో ఈ ప్రాంత రైతులు వర్షాధారిత, బోరు, బావులు కింద పంటల సాగుచేసి జీవనం సాగిస్తున్నారు.

వర్షాలు సరిగా కురవక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కొంత మంది రైతులు అప్పులు బాధ తాళలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. హంద్రీనీవా కాలువల ద్వారా నియోజక వర్గంలోని చెరువులన్నింటికి కృష్ణానది జలాలతో నింపి నీటి సమస్య పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటి వరకు నియోజకరవ్గంలో 5 చెరువులకే నీటిని వదిలారు. మిగతా చెరువులకు కూడా వదలాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంటలకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు పక్క రాష్ట్రాల్లోని మార్కెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో రవాణా ఖర్చులు అదనంగా పడడమే గాక ఇక్కడి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా పోతోంది. లక్షలాది రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డు నిరుపయోగంగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు.

- 2017లో రొళ్ల మండలంలోని రత్నగిరిలో లక్ష్మీకోళ్లాపురమ్మ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. గుడిబండ మండలం రాళ్లపల్లి వద్ద మరో రిజర్వాయర్‌కు డీపీఆర్ తయారు చేయడానికి నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయాయి.
- అమరాపురం, గుడిబండ మండలాల్లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు గానీ ఇంతవరకు నెరవేరలేదు.
- అగళి మండల కేంద్రంలో సామూహిక మరుగుదొడ్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.
- గుడిబండ మండలం రాళ్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో పాలనా పరమైన అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుత వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. హంద్రీనీవా కాలువల పనులు, కల్వర్టుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గుడిబండ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల భవనాలు గత తెలుగుదేశం హయాంలో రూ.23 కోట్లు మంజూరు చేశారు. సగభాగం నిర్మించి వదిలేశారు.
- అమరాపురం మండలంలో వక్కసాగు ఎక్కువగా ఉండడంతో మార్కెట్ ఏర్పాటు చేస్తామని నాయకులు హామీలు ఇస్తున్నారేగానీ ఇంతవరకు పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వంలో వక్క మార్కెట్ కోసం స్థలం కేటాయించి రూ.3.50 కోట్లు మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వం రావడంతో దానిని విస్మరించారు.
- అమరాపురం నుంచి విరుపసముద్ర కర్ణాటక సరిహద్దు వరకు 8కిలో మీటర్ల రోడ్డు తొలగించి కంకర వేశారు. రోడ్డు నిర్మించకపోవడంతో అటు వెళ్లేందుకు జనం ఇబ్బందులు పడుతున్నారు.
- మడకశిర పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపి 10 సంవత్సరాలు దాటిపోయింది.
- ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తెలుగుదేశం పార్టీ హయాంలో రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు చేపట్టారు. 2019 నాటికి 80 శాతం పనులు పూర్తయినా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మిగిలిన పనులు నిలిచిపోయాయి.
- మడకశిర పట్టణంలో 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చి నాలుగేళ్లు దాటుతున్నా నేటికీ భవననిర్మాణాలు పూర్తి కాలేదు. దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.
- పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్లో రూ. 5కోట్లతో సంత మార్కెట్ ఏర్పాటు చేయడానికి స్థలం చదును చేశారు. ఇప్పటి వరకు మార్కెట్ ఏర్పాటు చేయలేదు.
- మడకశిర పట్టణంలో రూ.48 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టి 75 శాతం పనులు పూర్తి చేసినా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	సిద్దనగౌడ్	ఇండిపెండెంట్	వెంకటశివమ్మ	కాంగ్రెస్	14,844
1962	బి.రుక్మిణీదేవి	కాంగ్రెస్	ఎన్.స్వామి	ఇండిపెండెంట్	9,006
1967	ఎంబీ రాజారావు	ఇండిపెండెంట్	బి.రుక్మిణీదేవి	కాంగ్రెస్	13,847
1972	ఎం.ఎల్లప్ప	కాంగ్రెస్	బి.రుక్మిణీదేవి	ఇండిపెండెంట్	13,125
1978	వై.తిమ్మారెడ్డి	కాంగ్రెస్	ఎస్.శ్రీరామరెడ్డి	జనతా	11,451
1983	వైసీ తిమ్మారెడి	కాంగ్రెస్	హెచ్‌బీ నర్సేగౌడ్	ఇండిపెండెంట్	5,604
1985	హెచ్‌బీ నర్సేగౌడ్	టీడీపీ	వైటీ ప్రభాకరరెడ్డి	కాంగ్రెస్	24,720
1989	ఎస్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	హెచ్‌బీ నర్సేగౌడ్	టీడీపీ	10,728
1994	వైటీ ప్రభాకరరెడ్డి	టీడీపీ	ఎస్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	6,339
1999	ఎస్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	ఈరేగౌడ్	టీడీపీ	27,556
2004	ఎస్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	వైటీ ప్రభాకరరెడ్డి	టీడీపీ	15,336
2009	కె.సుధాకర్	కాంగ్రెస్	కె. ఈరన్న	టీడీపీ	10,445
2014	కె.ఈరన్న	టీడీపీ	ఎం.తిప్పేస్వామి	వైసీపీ	14712
2018	ఎం.తిప్పేస్వామి	వైసీపీ	కోర్టు ద్వారా ఎన్నిక		
2019	ఎం.తిప్పేస్వామి	వైసీపీ	కె.ఈరన్న	టీడీపీ	13,136

మడకశిర నియోజకవర్గంలో ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్ జండర్	మొత్తం
అమరాపురం	23,530	23,389	-	46,919
గుడిబండ	21,809	21,351	-	43,160
రొళ్ల	15,660	15,017	-	30,677
అగలి	13,463	13,219	-	26,682
మడకశిర రూరల్	23,357	23,074	1	46,432
మడకశిర అర్బన్	8,423	8,781	-	17,204
మొత్తం	1,06,242	1,04,831	1	2,11,074

తొలి ఎమ్మెల్యే సిద్దనగౌడ్

మడకశిర తొలి ఎమ్మెల్యే సిద్దనగౌడ్. ఈయన మడకశిర పట్టణానికి చెందిన సిద్దరామేగౌడ, దేవీరమ్మల కుమారుడు. 1894 జూన్ 15న జన్మించారు. 1975 ఆగస్టు ఆయన మృతిచెందారు. తొలిసారిగా సిద్దనగౌడ 1952లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. 1952లో సిద్దనగౌడ్‌పై కాంగ్రెస్ నుంచి మడకశిర మండలం వైబీ హళ్లి గ్రామానికి చెందిన వైసీ తిమ్మారెడ్డి సతీమణి వెంకటశివమ్మ పోటీచేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో సిద్దనగౌడకు 23,214 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి వెంకటశివమ్మకు 8,370 ఓట్లు వచ్చాయి. 14,844 ఓట్ల మెజార్టీతో సిద్దనగౌడ్ విజయం సాధించారు.


భక్తరహళ్లి నరసింహస్వామి దేవాలయం


నరసింహ స్వామి మూలవిరాట్

రాజకీయ చరిత్ర

మడకశిర నియోజకవర్గం 35,724 చదరపు కిలోమీటరు విస్తీర్ణంలో ఉంది. 1952లో మడకశిర నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు మడకశిర, రొళ్ల, గుడిబండ, అగళి, అమరాపురం ఉన్నాయి. నియోజకవర్గంలో 2,57,820 జనాభా ఉంది. 2,11,074 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,06,242 మంది, మహిళలు 1,04,831 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 14సార్లు ఎన్నికలు జరిగాయి. 1983లో వై.తిమ్మారెడ్డి సమీప స్వతంత్ర అభ్యర్థిపై 5,604 ఓట్లతో (అత్యల్ప) మెజార్టీతోను విజయం సాధించారు. 1999లో రఘువీరారెడ్డి సమీప టీడీపీ అభ్యర్థిపై 27,566 అత్యధిక ఓట్లతో విజయం సాధించారు. మడకశిర నియోజకవర్గంలో ఇప్పటి వరకు 14సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది సార్లు, టీడీపీ మూడు సార్లు, వైసీపీ ఒకసారి, స్వతంత్ర పార్టీ అభ్యర్థి ఒకసారి, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ఈరేగౌడ్‌పై 27,566 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుత సీడబ్ల్యూసీ మెంబరు రఘువీరారెడ్డి మడకశిర నియోజకవర్గం నుంచి మూడుసార్లు విజయం సాధించారు.

● నెరవేరని నాయకుల హామీ

గాలి మాటలేనా ?


సోమయాజులపల్లివద్ద మరమ్మతులకు నోచుకోని రహదారి

గాండ్లపెంట, ఏప్రిల్ 22: ఐదేళ్ల పాలనలో నాయకులు ఇచ్చిన హామీలు ఎన్నో ఉన్నాయని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సోమయాజుపల్లి పంచాయతీలో వేలపకుంట వయా సోమాయాజులపల్లికి రహదారి ఏర్పాటు చేశారు. గండిచెరువు నీటి ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయింది. అప్పట్లో ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్దారెడ్డి పరిశీలించి వెంటనే రహదారి మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. తరువాత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చినప్పుడు కూడా పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంతవరకు కార్యచరణ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా తూపల్లి, వంకపల్లి, పోరెడ్డివారిపల్లి, ఎర్రచేనుపల్లి, బొల్లుగుట్లపల్లి, వేపలకుంటకు రాకపోకలు కొనసాగిస్తారు. భారీ వాహనాలు రావాలంటే ఇబ్బందిగా ఉంది. మరి ఈ ఎన్నికల్లో ఏమి హామీ ఇస్తారో? ఏమి పనులు చేస్తారో చూడాలి.

రెండో ఈవీఎంను ఎప్పుడు వినియోగిస్తారంటే!




కదిరి అర్బన్, ఏప్రిల్ 22: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఒక నియోజకవర్గంలో 16మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు. ఒక ఈవీఎంలో 16మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. అంతకన్న ఎక్కువమంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. ఉదాహరణకు 18మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదట ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరి వివరాలు ఉంచుతారు. దీంతోపాటు ఏ పోలింగ్ కేంద్రంలో అయినా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటివరకు నమోదైన వివరాలు సీజ్ చేసి, రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

జగనన్నా..! కాలువ ఎండిపోయింది


నంబులపూలకుంట సమీపంలో ఎండిపోయిన హంద్రీనీవా కాలువ

నంబులపూలకుంట, ఏప్రిల్ 22: హంద్రీనీవాకాలువ ద్వారా చెరువులను నీటితో నింపి సాగు, తాగునీరు అందించి ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని అధికార పార్టీ నాయకులు ప్రగల్భాలు పలికారు. ప్రతిపక్షనేతగా జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో హంద్రీనీవా కాలువలకు మరమ్మతులు చేయించి, ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. తరువాత అధికారం చేపట్టారు. పాలనాకాలం ముగుస్తున్నా కాలువలకు మరమ్మతులుచేసి నీటిని విడుదల చేయలేదని రైతులు వాపోతున్నారు. వర్షాలు కురిస్తే ఈకాలువల్లో నీరుంటుందే కానీ, తరువాత చుక్కనీరుండదు. ఇప్పటికే కాలువలు ముళ్లపొదలతో నిండి, నెర్రెలు బారాయి.

వారసులే లేరు



వారసత్వ రాజకీయాలకు దూరంగా కదిరి

కదిరి, ఏప్రిల్ 22: కదిరి నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉంది. వారసులెవరూ ఎమ్మెల్యేగా గెలవలేదు. 1952-55లో కుటాగుళ్లకు చెందిన వేమారెడ్డి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన వారసులెవరూ తిరిగి పోటీచేయలేదు. 1962లో ఇ. గోపాల్‌నాయక్ గెలుపొందారు 1972లో సి. నారాయణరెడ్డి ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. 1975లో నిజాంవలి, 1983లో మహమ్మద్‌షాకీర్, 1985లో చెన్నూరు అబ్దుల్ రసూల్ ఎమ్మెల్యేలుగా గెలిచారు. అయితే వీరి వారసులెవరూ తిరిగి ఎమ్మెల్యేగా పోటీ చేయలేదు. 1989లో మహమ్మద్‌షాకీర్ కాంగ్రెస్‌నుంచి గెలుపొందగా, 1994లో జొన్నా సూర్యనారాయణ టీడీపీ నుంచి గెలుపొందారు. 1999లో ఎంఎస్ పార్థసారథి గెలుపొందారు. 2004లో జొన్నా రామయ్య గెలుపొందారు. 2009లో కందికుంట వెంకటప్రసాద్ గెలుపొందారు 2014లో అత్తార్ చాంద్‌బాషా, 2019లో పీవీ సిద్దారెడి గెలుపొందారు. వీరి వారసులెవరూ తిరిగి ఎమ్మెల్యేగా పోటీ చేయలేదు. 1952నుంచి నేటి వరకూ వరసత్వ రాజకీయాలు లేని నియోజకవర్గంగా కదిరి ప్రత్యేక గుర్తింపు పొందింది.

ఏ, బీ-ఫారాలు అంటే...

హిందూపురం: ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎక్కువగా బీ-ఫారం గురించి చర్చించుకుంటుంటారు. బీ-ఫారం దక్కినవారే ఆయా పార్టీల తరఫున బరిలో ఉంటారు. అయితే ఏ-ఫారం అనేది కూడా ఎన్నికల్లో కీలకమైనది. ఏ పార్టీకి అభ్యర్థి అయినా నామినేషన్ దాఖలు చేసే సమయంలో బీ-ఫారం సమర్పించాల్సి ఉంటుంది. ఈ బీ-ఫారంలో అభ్యర్థి పోటీ చేస్తున్న పార్టీ, గుర్తు, అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు ఆ పార్టీ అధ్యక్షుడి సంతకం వివరాలు ఉంటాయి. ఈ బీ-ఫారం సమర్పించిన తరువాతే అభ్యర్థికి పార్టీ గుర్తింపు కేటాయిస్తారు. ఇక ఏ-ఫారాన్ని ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఏ-ఫారంలో రాజకీయ పార్టీ పేరు, ఆ పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థుల పేరు, ఎక్కడి నుంచి బరిలో ఉన్నారనేది ఉంటుంది. ఏ-ఫారం కింద మూడు చోట్ల సంబంధిత పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. ఎవరూ ఫోర్జరీ చేసేందుకు వీలులేకుండా దరఖాస్తులో మూడు చోట్ల సంతకాలు చేయిస్తారు. అందరూ బీ-ఫారం సమర్పించిన తరువాతే అభ్యర్థుల వివరాలతో కూడిన ఏ-ఫారం ఎన్నికల కమిషన్‌కు అందిస్తాం. బీ-ఫారంలో ఉన్న పేరు వివరాలు అక్కడ పార్టీ సమర్పించిన ఏ-ఫారం సరిచూసిన తరువాతే అభ్యర్థి పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ గుర్తిస్తుంది. ఒకవేళ బీ-ఫారంలో అభ్యర్థి పేరుండి ఏ-ఫారంలో అభ్యర్థి పేరు లేకపోతే అభ్యర్థి ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లుగా గుర్తించదు. అందుకే బీ-ఫారంతోపాటు ఏ-ఫారం కూడా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంటాయి.

కోటయ్యా..! నీటి సమస్య తీరేదెప్పుడయ్యా?

చిల్లవారిపల్లిలో తీవ్ర తాగునీటి సమస్య

తాడిమర్రి, ఏప్రిల్ 22: ఆ గ్రామానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులూ వస్తారు. ఎన్నికల్లో తమను గెలిపించమని ఓటర్లతో పాటు అక్కడ కొలువైన కాటకోటేశ్వరుడిని వేడుకుంటారు. దేవుడికేమో మొక్కులు చెల్లిస్తారు కానీ ఆ గ్రామస్థుల సమస్యలు మాత్రం పరిష్కరించరు. ఈ తంతు గడచిన 20 ఏళ్లగా జరుగుతూనే ఉంది కానీ సమస్యలు పరిష్కారం కాలేదు. ఇదీ తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లి గ్రామ దుస్థితి. జల్‌జీవన్ మిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇంటింటికి కొళాయిలు బిగించాలంటూ పథకాన్ని ప్రవేశ పెట్టి నిధులు ఇచ్చినా అది చిల్లవారిపల్లిలో అమలు కాలేదు. బత్తలపల్లి, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, ముదిగుబ్బ, తాడిమర్రి, కొత్తచెరువు మండలా లకు నీరందించే చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఈ గ్రామానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నాయకులు ఎవరైనా ఆ దిశగా ఆలోచించి అక్కడి నుంచి నీరు ఇచ్చేందుకు ఏర్పాటు చేసి ఉంటే ఇక్కడ ఎప్పుడు నీటి సమస్య ఉండేదే కాదని గ్రామస్థులు అంటున్నారు. దాదాపు 1200 మంది ఓటర్లుగల గ్రామంలో మనుషులకే కాదు పశువులకు కూడా నీటి కరువే. ప్రభుత్వం ఏర్పాటుచేసిన బోరులో వస్తున్న నీరు గ్రామంలో ఒక మూలకు కూడా చాలడం లేదు. కాపరులు తమ గొర్రెలను కిలోమీటర్ల దూరంలో ఉన్న పొలాల వద్దకు తీసుకెళ్లి దాహార్తి తీరుస్తున్నా రు. గ్రామానికి కిలోమీటరు దూరంలోని బాటమ్మస్వామి ఆలయంలో ఉన్న బోరుబావే మనుషులకు దిక్కువుతోంది. దీనికి సింగిల్‌ఫేస్ మోటారు బిగించి నీటిని ట్యాంకుకు పెడుతుండగా అక్కడికి వెళ్లి గ్రామస్థులు తెచ్చుకుంటున్నారు. ఉపాధి పనులకు వెళ్లి వస్తూనే ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా నీటి కోసం పరిగెత్తాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు.




గ్రామానికి అంతటికీ నీరందిస్తున్న బాటమ్మగుడి వద్ద ఉన్న బోరుబావి

● పశువులకు కూడా నీరివ్వలేకున్నాం..

ఎండలు మండిపోతున్న పరిస్థితులలో మూగజీవాలకు సరైన నీటిని అందించలేకపోతున్నాం. రోజు మోటారు సైకిళ్లపై బాటమ్మగుడి వద్ద నుండి నీటిని తీసుకొస్తున్నా మనుషులకే చాలడం లేదు. పశువులకు అరకొరగా అందిస్తున్నాం.

- శివానందరెడ్డి



● ప్రభుత్వం నీటి సమస్యను తీర్చాలి

నీటి బిందెలను ఎత్తుకురావడం చేతకాక ఆటోల్లో తీసుకెళ్తున్నాం. బాడుగకు ఆటో తీసుకుని కిలోమీటరు దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటు న్నాం. ఈ వయస్సులో కూడా నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- వన్నక్క, చిల్లవారిపల్లి

డిపాజిట్ దక్కడమంటే..

కొత్తచెరువు, ఏప్రిల్22: ఏ ఎన్నికలోనైనా పోటీ చేసిన అభ్యర్థికి డిపాజిట్ దక్కలేదు అంటే చిత్తుచిత్తుగా ఓడిపోయారని అర్థం. అసలు డిపాజిట్ దక్కడమంటే ఏంటో తెలుసుకుందాం. ఎన్నికలలో పోటీ చేసే వారు 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కొంత డబ్బు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలలో అయితే జనరల్ కేటగిరికి చెందిన వారు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5వేలు డిపాజిట్ కింద చెల్లించాలి. ఎంపీ అభ్యర్థి అయితే రూ.25వేలు, రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులైతే రూ.12,500 చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్ వేసే సమయంలో ఈ సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికలలో ఓట్లు లెక్కింపు పూర్తి అయిన తరువాత విజయం సాధించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లలో ఆరింట ఒకటవ వంతు 16.5 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్మును వెనక్కి ఇస్తారు. అంతకంటే తక్కువ ఓట్లు సాధించిన వారికి డిపాజిట్ సొమ్ము ఇవ్వరు.

ఎవరడిగినా.. మా ఓటు మీకే..!



ధర్మవరం, ఏప్రిల్ 22: ఎన్నికల వేళ చిత్ర, విచిత్రాలు గోచరిస్తున్నాయి. ఓటర్ల నాడి పట్టలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ నాయకుడు పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి హాజరవుతున్నారు. ఈ విషయం తెలుసుకుని అవతల పార్టీ వారు ప్రశ్నిస్తే ఇంటికి వచ్చి పిలిస్తే వెళ్లక తప్పడంలేదు అన్నా కానీ మా ఓటు మాత్రం మీ పార్టీకే వేస్తామంటూ సమాధానం చెబుతున్నారు. దీంతో వారు ఎవరికి ఓటు వేస్తారోనన్న అయోమయం అభ్యర్థుల్లో నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశ్యంతోనే కొందరు ఇలా చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికే పట్టణాల్లో, గ్రామాలలో ప్రధాన పార్టీ ఎన్నికల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఈక్రమంలో ప్రచారాలకు బహిరంగంగా వెళ్లి మద్దతు పలికి వారితో ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. సర్వేలు చేసేవారు కూడా ఇటువంటి వారిని ప్రశ్నిస్తే పార్టీలకేముంది ఎన్నికల రోజున మాకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తాం, అంతవరకు ఏ ఒక్క పార్టీ నేతలకు చెడ్డకాకుండా ఉండటానికే ఇలా చేస్తున్నామంటూ సమాధానాలు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22: ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సోమవారం ఖరారు చేసింది. కళ్యాణదుర్గం నియోజక వర్గానికి రాంభూపాల్‌రెడ్డి, ధర్మవరం నియోజకవర్గానికి అశ్వత్థనారాయణను ఖరారు చేసినట్లు ఏపీసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ప్రకటించారు. కాగా హిందూపురం నియోజకవర్గానికి నాగరాజు స్థానంలో మహమ్మద్ హుస్సేన్ ఇనయతుల్లాను నియమించినట్లు తెలిపారు.

టెన్త్‌లో సత్తాచాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు


వెన్నెల వర్షిణి-586 గ్రీష్మ-571

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 22: మండలంలోని జగరాజుపల్లి ఆదర్శపాఠశాల విద్యార్థులు సోమవారం వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు 51 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. వీరిలో 12 మంది 500 మార్కుల పైచిలుకు సాధించారన్నారు. ఇందులో వెన్నెల వర్షిణి 586/600, గ్రీష్మ 571, గ్రీష్మంత్ 544, మహమ్మద్ నవాజ్ 541, విష్ణువర్ధన్ 539 మార్కులు సాధించారన్నారు

మంగళకర విద్యార్థులు..


లిఖిత-584 దర్శని-583

పట్టణంలోని మంగళకర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కరెస్పాండెంట్ సురేష్‌కుమార్ తెలిపారు. తమ పాఠశాలలో 39 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారని అన్నా రు. వీరిలో లిఖిత 584, దర్శిని 583, రమ్య 580, తేజస్విని 576, చేతన్‌సాయి 564, నాగలక్ష్మి 563 మార్కులు సాధించారన్నారు.

కాకతీయ పాఠశాల..


వై. నిత్యశ్రీ-594 జీ.అనూష-592

ధర్మవరం: పట్టణంలోని కాకతీయ పాఠశాలలో 55 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని కరెస్పాండెంట్ శెట్టిపి నిర్మలా జయచంద్రారెడ్డి తెలిపారు. అందులో యనమల నిత్యశ్రీ594, భీమనపల్లి అనూష 592, చింతలపల్లి తరుణ్‌కుమార్‌రెడ్డి582, కోట్ల జ్ఞానరూప578, బుగుడూరు జీవన్569, పెన్నబడి అక్షర569, పెద్దరాసి నిఖిలేశ్వరి564 అత్యధిక మార్కులు సాధించారు.

యశోద పాఠశాల..


బి.హర్షిత-592 భువనశ్రీ-591

యశోద పాఠశాలలో 129 మందికి గాను 580పైగా మార్కులు 9 మంది విద్యార్థులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. 540పైన 51 మంది సాధించారన్నారు. హర్షిత 592, భువనశ్రీ 591, జశ్వంత్‌రెడ్డి 589, విజయదుర్గా588, మోక్షిత్586, తమీన586 మార్కులు సాధించారన్నారు.

రూపారాజా పాఠశాల..


హరిణి-593 గ్రీష్మ-590

ధర్మవరం మండలం నాగలూరు వద్దగల రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో 153 మందికి గాను అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. ఇందులో హరిణి593, గ్రీష్మ590, శరత్‌సాయి586, రేవంత్586, జయసూర్య585, లేఖన583, మౌక్షిత583, రూపేష్581,నేహ581, ఆకాశ్‌రెడ్డి580 మార్కులు సాధించారన్నారు. 550పైగా మార్కులను 43 మంది, 500పైన 96 మంది మార్కులు సాధించారన్నారు.

గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినుల ప్రతిభ


బీ.తులసీబాయి-589 జీ.మాకమ్మ-582 జీ.సురేఖ-575

తనకల్లు: మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు పది పరీక్షల్లో ప్రతిభ చూపారు. ఇందులో అత్యధికంగా బీ. తులసీ బాయి 589, జీ. మాకమ్మ 582, బీ. సురేఖ 575 మార్కులు సాధించినట్లు ఎంఈఓ లలితమ్మ తెలిపారు. మండలంలో ఆరు పాఠశాలలుండగా.. గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులే అధిక మార్కులు సాధించారన్నారు.

బుక్కపట్నం మండల టాపర్ సౌమ్య

బుక్కపట్నం: మండలవ్యాప్తంగా 444మంది పది పరీక్షలు రాశారని, అందులో 382మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. మండలకేంద్రంలోని బాలికల పాఠశాల విద్యార్థిని సౌమ్య 592 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు.

నల్లచెరువులో 96 శాతం ఉత్తీర్ణత


ఆకాష్.581 జడ్పీహైస్కూల్ బృందసాయి-581 మోడల్‌స్కూల్

నల్లచెరువు: మండల వ్యాప్తంగా 288మంది పదిపరీక్షలు రాగా 282మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓలు తిరుపాల్‌నాయక్, చెన్నకేశవ కుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో 136మందికి గాను 130మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో ఎ. ఆకాశ్ 581, ఎ. విజయ్‌కుమార్ 550, షారుక్‌ఖాన్ 549 మార్కులు సాధించారన్నారు. మోడల్ స్కూల్‌లో 92మందికి గాను అందరూ పాసయ్యారన్నారు. వీరిలో బీ. బృందసాయి 581, ఎం. అర్చన 579, పీ. సతీష్ 570 మార్కులు సాధించారన్నారు. ఇక తవలంమర్రి పాఠశాలలో 13మందికి 13, కస్తూరిబాలో 39కి 39, ఉబిచెర్లలో 8మందికి 8మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

నంబులపూలకుంట మండలంలో 84.2శాతం..


లిఖిత్‌రాయల్ 576 హేమలత 574

నంబులపూలకుంట: మండలవ్యాప్తంగా 298మంది విద్యార్థులు పరీక్షలు రాగా 251మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. 84.2 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. గూటిబైలు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన లిఖిత్‌రాయల్ 576, హేమలత 574, మండలంలో మొదటి, రెండవ స్థానాలు సాధించారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ

నల్లమాడ: పది పరీక్షల ఫలితాల్లో మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఎంఈఓలు వేమనారాయణ, రమేష్‌బాబు తెలిపారు. రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్న పాఠశాలఉ చెందిన అమృతవాసవి 549 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందన్నారు.

తాడిమర్రిలో 65 శాతం ఉత్తీర్ణత


అర్చన(535) లక్ష్మి(523)

తాడిమర్రి: మండలంలో 247 మంది పరీక్షలు రాయగా 121 మంది ఉత్తీర్ణులై 65శాతం సాధించినట్టు ఎంఈఓక్రిష్ణమోహన్ తెలిపారు. వీరిలో 111 మంది ఫస్ట్‌క్లాస్ ,34 మంది సెకెండ్ క్లాస్, 16 మంది థర్డ్‌క్లాసులో పాసు కాగా 35 మంది ఫెయిల్ అయ్యారన్నారు. పిన్నదరి పాఠశాలకు చెందిన అర్చన(535), దాడితోట పాఠశాలకు చెందిన లక్ష్మి(523), ఆత్మకూరుపాఠశాలకు చెందిన ప్రవల్లిక(494) మార్కులతో పాసై మొదటి స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా నారసింపల్లి జేవీఎం ఆర్డీటీ పాఠశాలకు చెందిన విద్యార్థులు చిందు(569), యామిని(564), మేఘన(559) మార్కులతో పాసయ్యారు.


594 మార్కులతో విద్యార్థిని సత్తా


దీక్షిత

ధర్మవరంరూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని కుణుతూరు గ్రామానికి చెందిన విద్యార్థిని దీక్షిత సత్తాచాటింది. పోతుకుంటలోని ప్రియదర్శిని విద్యామందిరం పాఠశాలలో చదివిన ఈమె 594 మార్కులు సాధించి సత్తా చాటింది.

రాణించిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని వశిష్ట ఇంగ్లిష మీడియంలో 67మందికి అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు కరెస్పాండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి తెలిపారు. అందులో కె. మౌనిషా 589, నవాజ్‌ఖాన్ 580, మంజునాథ్ 578 మార్కులు సాధించారన్నారు. శ్రీవిజ్ఞాన్‌లో 88కి 85మంది ఉత్తీర్ణత సాధించినట్లు కరెస్పాండెంట్ మస్తాన్ తెలిపారు. వారిలో వినయ్‌కుమార్‌రెడ్డి 587, తబ్రేజ్ 586, దివ్యశ్రీ 583, జావియా 581 సాధించారన్నారు. రైయిన్‌బోలో మేఘనాథ్‌రెడ్డి 593, హర్షవర్ధన్‌రెడ్డి 587, లజికా 579 సాధించినట్లు, వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కరెస్పాండెంట్ జయసింహారెడ్డి తెలిపారు. విజ్ఞాన్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో 61కి 60మంది ఉత్తీర్ణులైనట్లు కరెస్పాండెంట్ ఎం. ఫక్రుద్దీన్ తెలిపారు. వారిలో టి. సునిత 585, అభిషేక్ 581, అజయ్‌కుమార్‌నాయక్ 573 మార్కులు సాధించినట్లు చెప్పారు.


మేఘనాథ్‌రెడ్డి 593 రైయిన్‌బో స్కూల్ | కె.మౌనిషా 589 వశిష్ట స్కూల్ | వినయ్‌కుమార్‌రెడ్డి 587 శ్రీవిజ్ఞాన్ స్కూల్ | టి. సునిత 585 విజ్ఞాన్ స్కూల్

వైపీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: పల్లె సింధూర


టీడీపీలోకి చేరినవారిలో ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి


రాగానిపల్లి బస్టాండ్ కూడలిలో మాట్లాడుతున్న పల్లె రఘునాథ్‌రెడ్డి

బుక్కపట్నం, ఏప్రిల్ 22: ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని టీడీపీ కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు కోట వీధిలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ను గెలిపించాలని కోరారు. తొలుత వాల్మీకి ఆలయంలో పూజలు చేశారు. మం డల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, బాలు, సయ్యద్‌బాషా, జంగం వెంకటరాముడు, రామక్రిష్ణ, శ్రీరాముడు, జయరాం కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక ఎస్సీకాలనీలో వైసీపీకి చెందిన 20కుటుంబాల వారు మాజీ సర్పంచ్ సాకే యశోదారాయుడు ఆధ్వర్యంలో, పల్లె సింధూర సమక్షంలో టీడీపీ లోకి చేరారు. వారికి సింధూర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో రామాంజనేయులు, రామక్రిష్ణ, బుగ్గపల్లి నారాయణ, బుగ్గపల్లి గంగన్న, పశువుల రామాంజనేయులు, పశువుల గంగమ్మ తదితరులు ఉన్నారు.

దుర్మార్గ పాలనకు చరమగీతం పాడండి

ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు డీఎన్ మూర్తి పిలుపునిచ్చారు. బుక్కపట్నంలో పల్లె సింధూర చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లనుంచి జగన్ ప్రభుత్వం దుర్మార్గపు విధానాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, జగన్ దుర్మార్గపు పాలకు చరమగీతం పాడాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కల్లు గీత కార్మికుల కన్వీనర్ హరిక్రిష్ణగౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ జ్యోతి ప్రసాద్, జిల్లా కోశాధికారి సురేంద్రబాబు, మండలాధ్యక్షులు చెన్నప్ప, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుందాం: పల్లె

నల్లమాడ: చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గోపేపల్లి పంచాయతీ రాగానిపల్లి, గోపేపల్లితండా, గోపేపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయాగ్రామాల్లో నాయకులు, ప్రజలు బాణసంచా కాల్చి, పూలవర్షం కురిపిస్తూ ఘన పలికారు. ఆయన ఇంటింటా తిరిగి కూటమి అభ్యర్థులు గెలిపించాలని ప్రజల్ని కోరారు. రాగానిపల్లిలో మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, నాసిరకం మద్యం విచ్చలవిడిగా రవాణా సాగుతోందన్నారు. వీటిని అరికట్టాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

నల్లమాడ: రాగానిపల్లిలో మాజీ మంత్రి పల్లె సమక్షంలో పదికుటుంబాల వారు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో ఉట్ల నరసింహారెడ్డి, ఎర్రా రంగారెడ్డి, వల్ల చంద్రశేఖర్, రవీంద్రారెడ్డి , మసకవంకపల్లి వార్డు సభ్యుడు చలపతి ఉన్నారు.

కొత్తచెరువు: మండల కేంద్రంలోని విజయనగర కాలనీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు, మహిళలు టీడీపీలోకి చేరారు. పుట్టపర్తిలో కూటమి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డిని కలిసి ఆమె సమక్షంలో టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. వారికి పల్లెసింధూర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువనేత పల్లెవెంకట కృష్ణకిశోర్‌రెడ్డి, నాయకులు అడపాల రామక్రిష్ణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, గాజులచంద్ర, బండ్లపల్లిరాజు, అనిల్,మహేశ్, భాస్కర్ పాల్గొన్నారు.


హైరావతంపై ఊరేగినచెన్నకేశవుడు

ఐరావతంపై ఊరేగిన శ్రీవారు

తాడిమర్రి, ఏప్రిల్ 22: మండలకేంద్రంలో లక్ష్మీతా రమచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం స్వామివారిని ఐరావతం(తెల్లఏనుగు)పై ఊరేగించారు. తొలుత అర్చకులు, ఆలయనిర్వాహకులు ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఐరావతం మీద కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. తర్వాత రాత్రి 12 గంటల సమయంలో స్వామి కల్యాణాన్ని మామిళ్లపల్లి సంతోష్‌శర్మ నిర్వహించారు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కల్యాణోత్సవానికి ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బారెడ్డి కుటుంబసభ్యులు తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు.

దాడి కేసులో ఏడాది జైలు

కదిరి, ఏప్రిల్ 22: ఇద్దరి వ్యక్తులపై కర్రతో దాడిచేసిన కేసులో సోమవారం కదిరి ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు న్యాయాధికారి ఎస్. ప్రతిమ తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కదిరి రూరల్ మండలం చవిటితండాకు చెందిన యుగంధర్‌నాయక్ 2016లో అదే తండాకు చెందిన ఇద్దరిపై కర్రతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. దీనిపై పోలీసులు అప్పట్లో కేసు నమోదుచేశారు. కోర్టులో విచారణానంతరం నిందితుడికి యేడాది జైలుతో పాటు రూ.పదివేలు జరిమానా విధించినట్లు న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధితుల తరఫున ఏపీపీ లక్ష్మీసాయి, రామక్రిష్ణ వాదనలు వినిపించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: కందికుంట యశోదాదేవి


ప్రచారంలో పాల్గొన్న యశోదాదేవి

కదిరి, ఏప్రిల్ 22: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని 35వ వార్డులో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. చంద్రబాబు వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, వార్డు కౌన్సిలర్ రంగారెడ్డి, వార్డు ఇన్‌చార్జి కొయ్యరాజేంద్రనాయుడు, నాయకులు పర్వీనాబాను, గుత్తా గోపాల్‌నాయుడు, కళ్యాణ్, కౌన్సిలర్ అల్పాముస్తఫా, ఎంఎస్ ఫయాజ్, మహబూబ్‌బాషా, జనసేన నాయకులు బ్లూమూన్ శంకర్, మహిళలు కొమ్మినేని కల్పనాచౌదరి, పీట్ల రమణమ్మ, గంగరత్నమ్మ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం నెలకొల్పుతా: సత్యకుమార్



ర్యాలీలో పాల్గొన్న సత్యకుమార్ తదితరులు

ధర్మవరం, ఏప్రిల్ 22: ఎన్నికల్లో తాను గెలిస్తే అస్తవ్యస్తంగా ఉన్న ధర్మవరం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుతానని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆయనకు మద్దతుగా సోమవారం సామాజిక వేత్త గడ్డం రాజగోపాల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సత్యకుమార్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. ధర్మవరంలో శాంతిని కోరుకునేవారు కూటమిని గెలిపించాలన్నారు. తాము గెలిస్తే నియోజకర్గానికి అరాచకపాలన నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేలా చేస్తామన్నారు. గ్రామాలలో అన్ని సమస్యల్ని తీర్చుతామన్నారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ ని కొనసాగించారు. అన్నిసంఘాల వారు ర్యాలీకి మద్దతు పలికారు. కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు సత్యకుమార్ నామినేషన్ దాఖలు

కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈయన మొదట తిక్కస్వామి నగర్‌లోని శివాలయంలో పూజలు చేయించనున్నారు. అనంతరం అక్కడి నుంచి భారీ ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి విజయ్‌కుమార్‌సింగ్, సినీనటుడు సాయికుమార్ హాజరుకానున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని నాయకులు పిలుపు నిచ్చారు.

సత్యకుమార్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి

ధర్మవరం: ఉమ్మడి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌ను గెలిపించుకుంటే ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుమతిసురతాని పేర్కొన్నారు. పట్టణంలోని 25వ వార్డులో ఆమె క్లస్టర్, సెక్షన్ ఇన్‌చార్జిలతో సమావేశమై మాట్లాడారు. ధర్మవరంలో ఎన్నోఏళ్ల తరువాత బీసీ నాయకుడు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారన్నారు. ఆయన్ను గెలిపించుకుంటే ధర్మవరం ఎంతోఅభివృద్ధి చెందుతుందన్నారు. సత్యకుమార్ కేంద్రంలో మంచిపేరున్న వ్యక్తిఅని, అలాంటి నాయకుడిని గెలిపించుకుంటే కేంద్రం నుంచి కావలసిన నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జ్‌భీమనేని ప్రసాద్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి బీజేపీలో చేరికలు

ముదిగుబ్బ/బత్తలపల్లి: ముదిగుబ్బ మండలంలో వైసీపీ నుంచి బీజేపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. మండలంలోని ఎం కొట్టాల, ఈదులపల్లి, గుంజేపల్లి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వైసీపీశ్రేణులు బీజేపీలోకి చేరినట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ధర్మవరంలోని పార్టీ కార్యాలయంలో వారందరూ బీజేపీలోకి చేరారు. సత్యకుమార్ యాదవ్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ యాదవ్, గణపర్తి రమేష్, లింగానాయుడు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి,అనంతసాగరం, పత్యాపురంగ్రామాల నుంచి సుమారు 200 కుటుంబాల వారు వైసీపీని వీడి బీజేపీలోకి చేరారు. అదేవిధంగా ధర్మవరంలోని2,6వ వార్డుల నుంచి కూడా పలువురు వైసీపీ నాయకులు సత్యకుమార్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ల సస్పెన్షన్

- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు చేపట్టలేదెందుకో?


19న ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ రాజు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 22: మండలంలోని కుణుతూరు గ్రామంలో ఈనెల 19వతేదీన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, అదేగ్రామానికి చెందిన వలంటీర్లు దీప, ప్రమీల పాల్గొన్నారు. అయితే దీనిపై విచారించిన అధికారులు వలంటీర్లు దీప, ప్రమీలను సస్పెన్షన్ చేసినట్లు ఎంపీడీఓ మమతాదేవి తెలిపారు. ఫీల్డ్‌అసిస్టెంట్ రాజుపై చర్యలకు పీడీకి నివేదికలు అందజేసినట్లు చెప్పారు. కాగా మూడు రోజులు గడుస్తున్నా ఫీల్డ్‌అసిస్టెంట్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో పలువురు అధికారులే ప్రశ్నిస్తున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో న్యాయమా అంటూ పెదవి విరుస్తున్నారు. ప్రచారంలో పాల్గొన్న ఫొటోలతో సహా ఆంధ్రజ్యోతిలో ప్రచురించినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో తెలియాల్సి ఉంది.

ఎన్నికల ప్రచారంలో వలంటీరు


వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ సుమాంజలి

కొత్తచెరువు, ఏప్రిల్ 22: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సతీమణి అపర్ణ ఎన్నికల ప్రచారం చేపట్టార. అయితే ఇందులో నాల్గవ సచివాలయానికి చెందిన వలంటీరు సుమాంజలి పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈమెపై శాఖ పరమైన తీసుకోవాలంటూ స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. అయితే వలంటీర్లు మాత్రం వాటిని బేఖాతర్ చేస్తూ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు.

పంచాయతీ కార్యాలయం తనిఖీ

తనకల్లు, ఏప్రిల్ 22: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని డీపీఓ విజయ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తిరెడ్డిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన గ్రామాల్లో నెలకున్న తాగునీటి సమస్యను డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీపీఓ వెంటనే ఆర్వో ద్వారా కలెక్టర్‌కు అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల్లో మొదటిసారి హోం ఓటింగ్

తనకల్లు, ఏప్రిల్ 22: ఎన్నికలు మొదలైనప్పటి నుంచి తొలిసారిగా హోం ఓటింగ్ వేయడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. కదలలేక(పూర్తిగా నగడవలేని) మంచానికే పరిమితమైన వ్యక్తుల వద్ద నుంచి ఫారం -12 బీ తీసుకుని హోం ఓటింగ్‌కు బీఎల్వోలు సిఫార్సు చేశారు. అలా సిపార్సు చేసినవాటిని పరిశీలించి మండల వ్యాప్తంగా హోం ఓటింగ్ కోసం 34మందికి అవకాశం కల్పిస్తున్నట్లు తహసీల్దార్ శోభా సువర్ణమ్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. హోం ఓటింగ్ నిర్వహించడానికి మే 5 నుంచి 10వతేదీలోపు సెక్టారు అధికారి, బీఎల్‌ఓ, అబ్జర్వర్, పోలీసు తదితరులతో కమిటీ ఏర్పాటు చేసి, వారి ద్వారా ఈవీఎంను హోం ఓటింగ్ కోసం పంపనున్నట్లు చెప్పారు. అర్హత పొందిన వారి ఇళ్లవద్దకు వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మొటమొదటి సారిగా ఎన్నికల్లో ఈ అవకాశం వచ్చిందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, ఏప్రిల్ 22: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. మృతుడికి 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందన్నారు. నలుపురంగు రౌండ్‌నెక్ బనియన్, ఆరంజ్‌కలర్ డ్రాయర్, గ్రీన్‌కలర్ చొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలించామన్నారు. ఎవరికైనా మృతుడి సమాచారం తెలిస్తే 9441238182, 9440627641కు సమాచారం అందించాలని కోరారు.

అంత్యక్రియలకు రూ.25వేలు అందజేత

తనకల్లు, ఏప్రిల్ 22: మండలకేంద్రానికి చెందిన నాగరాజు (50) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. మృతుడు చిలమత్తూరు మండలంలోని కొడికొండ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మృతి విషయం తెలుసుకున్న డీపీఓ విజయ్‌కుమార్ తనకల్లుకు వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.25వేలు అందజేశారు.

ధర్మవరం కాంగ్రెస్ అభ్యర్థిగా రంగన అశ్వత్థనారాయణ



ధర్మవరం, ఏప్రిల్ 22:ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా రంగన అశ్వర్థనారాయణ పేరు ఖరారైంది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం ప్రకటించారు. ఈయన చేనేత వర్గానికి చెందినవారు. రంగన అశ్వర్థనారాయణ గతంలో కూడా రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ప్రస్తుతం మూడో సారి ధర్మవరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పేరు ఖరారైంది.

ఈవీఎం స్ట్రాంగ్‌రూం పరిశీలన

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 22: జిల్లాకేంద్రంలోని ఈవీఎం స్ట్రాంగ్‌రూంలను ఎస్పీ మాధవరెడ్డి సోమవారం రాత్రి తనిఖీ చేశారు. ఆర్డీఓ కార్యాలయం వెను క భాగంలో ఉన్న ఈవీఎం స్ట్రాంగ్‌రూంలను ఎస్పీ పరిశీలించి భద్రత పటిష్టంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈవీఎం పరిసరాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు

పుట్టపర్తి, ఏప్రిల్ 22: పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 26 వరకు గడవు పొడగించినట్లు కలెక్టరు అరుణ్‌బాబు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వివిధ శాఖల సిబ్బందితో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఇతర ఉద్యోగులు ఫారం 12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పనిచేసే చోటనే దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించందన్నారు. వందశాతం ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 22: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ కన్నయ్య తెలిపారు. మండలంలోని పెడపల్లి వద్ద ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేపట్టగా రాచువారిపల్లికి చెందిన బాబు ద్విచక్రవాహనంపై కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతడి వద్ద నుంచి 288 టెట్రాప్యాకెట్ల మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం అతడిపై కేసునమోదు చేసి రిమాండు పంపామన్నారు. తనిఖీల్లో సెబ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి గెలుపునకు సమష్టిగా కృషిచేద్దాం

నల్లచెరువు, ఏప్రిల్ 22: ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగా పని చేసి కూటమిని గెలిపించుకుందామని మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని అబ్దుల్ ఖాదర్ పెట్రోల్ బంకులో సోమవారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో వర్గాలుగా విడిపోయి ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఇప్పటికైనా అందరం కలిసి కట్టుగా ఉండి కూటమి గెలుపునకు కృషిచేద్దామని తెలిపారు. ఇందుకు అందరూ సమ్మతించారు. తర్వాత ఈనెల 25న కె.పూలకుంట, ఉబిచెర్లల్లో జరగనున్న ఎన్నికల ప్రచారంపై చర్చించారు. సీనియర్ నాయకులు అబ్దుద్‌ఖాదర్, దాదెం శివారెడ్డి, మాజీ ఎంపీపీ మాబూసాబ్, ఆంజనప్ప, నాగభూషణంనాయుడు, శివయ్య, ఆనంద్, వెంకటరమణ, అల్లాబక్ష, లక్ష్మీపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండల టాపర్ గౌతమి


గౌతమి -585

ముదిగుబ్బ, ఏప్రిల్ 22: మండల వ్యాప్తంగా 570 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 532 మంది పాస్ అయినట్లు ఎంఈఓ రమణప్ప తెలిపారు. కస్తూరిబా పాఠశాల విద్యార్థిని గౌతమి 585 మా ర్కులతో మండల టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థిని రీతూచౌహాన్ 574, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థి విక్టర్ 573 మార్కులు సాధించారన్నారు. అలాగే పీవీయస్ పాఠశాలకు చెందిన హర్షిత 584 మార్కులు తెచ్చుకున్నట్లు పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో మద్యం దుకాణం సేల్స్‌మెన్

నంబులపూలకుంట, ఏప్రిల్ 22: మండలంలోని సోమరాజుకుంటలో గత ఆదివారం వైసీపీ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎన్పీకుంట మద్యం దుకాణం సేల్స్‌మెన్ బాబ్‌జాన్ పాల్గొన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించ కూడదని ఈసీ పలుమార్లు హెచ్చరికలు జారీ చేస్తున్నా.. పలువురు అవేవీ పట్టించుకోవడం లేదు.

ప్రకటన

వడ్లమూడి సుధామణి W/o దేవేంద్ర నాయుడు D.No:3-854, శాంతినగర్, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా. Doc. No.5074/2004 సర్వేనెం.24/3లో 1.5 సెంట్లును శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ధర్మవరం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల7 రోజులలోపు ధర్మవరం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించండి. హద్దులు: తూర్పు:నోసం పుల్లారెడ్డి,వైకుంఠం నారమ్మ స్థలం, పడమర:33 అడుగుల రోడ్డు, ఉత్తరం: 33 అడుగుల రోడ్డు, దక్షిణం:వడ్లముడి సుధామణి స్థలం.

M.హుస్సేన్ బాషా, అడ్వకేట్, ధర్మవరం.

గంజాయి, డ్రగ్స్‌కు కేరాఫ్‌గా మారిన ఏపీ

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



బాలయ్యకు హారతులు పడుతున్న మహిళలు

హిందూపురం, ఏప్రిల్ 22: గంజాయి తదితర డ్రగ్స్‌కు దేశంలోనే ఆంధ్రప్రదేశ్ కేరాఫ్‌గా మారిందని హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యే నంద మూరి బాలకృష్ణ అన్నారు. ఆయన సోమవారం లేపాక్షి మండలం పుల మతి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మానెంపల్లి, శిరివరం, ఫైదుగోళం, కంచిసముద్రం, కోడిపల్లి, గ్రామాల్లో పంచాయతీ పరిధిలో సాగింది. ఈ సందర్భంగా ఆయనకు పల్లెల్లో మహిళలు నీరాజనం పలికారు. ఈ సందర్భంగా బాలకృష్ణ జనాలను ఉద్దేశించి మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగించిందన్నారు. గత టీడీపీ హయాంలో కొటిపి వద్ద 2800టి డ్కో ఇళ్లు నిర్మిస్తే వాటిని లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అందజేస్తామన్నారు. నా ఎస్సీలు అంటూనే వైసీపీ నాయకులు దళితులను చంపి డోర్ డెలివరీ చేస్తున్నారని విమర్శించారు. మద్యపాన నిషేధమని హామీ ఇచ్చిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక జే బ్రాండ్లు తీసుకొచ్చి వేలాదిమంది మహిళల తాళిబొట్లు తెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యంతో లక్షల కోట్లు స్వాహా చేశారన్నారు. సీఎం సొంత నియోజకవ ర్గంలోనే ఒక మహిళను మానభంగం చేసి చంపితే అ డిగే వారు లేరన్నారు. మాస్క్ అడిగిన డాక్టర్‌ను బలవ న్మరణానికి ఉసిగొల్పిన ఘనత ఈ ప్రభుత్వాదేన్నారు. సొంత చెల్లికి, తల్లికి న్యాయం చేయలేని ఈ ముఖ్య మంత్రి రాష్ట్ర ప్రజలకు ఏమి చేస్తారన్నారు. జగమెరిగిన జగన్నాటకుడు అని దుయ్యబట్టారు. ఒక్కచాన్స్‌తో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారన్నారు. ఎన్టీఆర్ చంద్రబాబు అభినవ భగీరథులని, వారు చేసిన అభివృద్ధి మాత్రమే కళ్లకు కనపడుతోందన్నారు. ఎన్నికల ప్రచారానికి వైసీపీ నాయకులు ఇంటి వద్దకు వస్తే ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించాలన్నారు. ఐదేళ్లలో ఎక్కడ అభి వృద్ధి చేశారో చెప్పాలని నిలదీయాలన్నారు. అంబే డ్కర్ విదేశీ విద్యను నిర్వీర్యం చేసి తనపేరు పెట్టుకు న్నాడని, మరి ఏ ఒక్కరినైనా విదే శాలకు పంపి చదివించారా అని ప్రశ్నించారు. అంబేడ్కర్ కంటే గొప్పవాడా జగన్ అని అన్నారు. దళితులు దీనిపై ప్రశ్నించాలన్నారు. సమస మాజ స్థాపన కావాలంటే ప్రజలు ఆలోచించి ఉమ్మడిగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు నందమూరి అభిమానులుపాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక: లేపాక్షి మండలం శిరివరం ఎంపీటీసీ నాగమణి, ఆమె భర్త మంజునాథ్‌తో పాటు శిరివ రానికి చెందిన 15కుటుంబాలు సోమవారం పట్టణం లోని ఎమ్మెల్యే నివాసం వద్దకు చేరుకుని బాలయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి బాలకృష్ణ కండువా కప్పి ఆహ్వానించారు.

అక్కదేవతలకు ఘనంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో అక్కదేవతలు

గుడిబండ, ఏప్రిల్ 22: మండలంలోని ఎస్ఎస్ గుండ్లు గ్రామంలో వెలసిన అక్కదేవతల ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల ను ప్రత్యేక పూలతో అలంకరించి వి శేష పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. హాజరైన భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. అనేకమంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు

రాష్ట్ర విద్యాశాఖ సోమవారం విడుదల చేసిన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు మంచి ఉత్తీర్ణత సాధించాయి. వివరాలు ఇలా ఉన్నాయి.

గోరంట్ల, ఏప్రిల్ 22: మండలంలోని ప్రభుత్వపాఠశాలల నుంచి 667మంది పరీక్షలు రాయగా 477మంది ఉత్తీర్ణలై 71.51శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎం ఈఓలు గోపాల్, జాన్‌రెడ్డెప్ప తెలిపారు. గోరంట్ల బాలికల పాఠశాలలో 140మందికి 118 మంది ఉత్తీర్ణలు కాగా, మానస 587, నేహాఫైర్‌దోస్ 585, సాయిశ్రీ 582 మార్కులు సాధించారు. పాల సముద్రం పాఠశాలలో 125కుగాను 79మంది ఉత్తీర్ణులు కాగా, చందన 591 మార్కులతో మండల టాపర్ గానిలిచారు. నందకిషోర్ 585, సతీష్ 575 మార్కులు సాధిం చారు. బూదిలి పాఠశాలలో 63కు గాను 36, నాజర్‌తౌహీద్ 576 మార్కులు సాధించారు. మల్లాపల్లిలో 22మందికి 18 మంది ఉత్తీర్ణులు కాగా.. నందిని 579 మార్కులు సాధించింది. మందలపల్లిలో 26కు 20 మంది, పులేరులో 44కు35 మంది, వానవోలులో 45కు 29 మంది ఉత్తీ ర్ణులయ్యారు. గోరంట్ల బాలుర పాఠశాలలో 115కు 66 మంది ఉత్తీర్ణులు కాగా స్వరూ పానంద 577, చైతన్య 573 మార్కులు సాధించారు. ఉర్దూ పాఠశాలలో 15కు 13 మంది, గిరిజన బాలికల గురుకులంలో 37కు 33మంది, కేజీబీవీలో 35కు 30మంది ఉత్తీర్ణులయ్యారు.



శ్రీలేఖ (588) గౌతంనాయక్(583) నిర్వాణశ్రీ(578) స్ఫూర్తి (570)

చిలమత్తూరు, ఏప్రిల్ 22: మండలంలోని పాఠశాలల విద్యార్థులు 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. టేకులోడు గురుకుల పాఠశాలకు చెందిన శ్రీలేఖ 588 మార్కులు సాధించి మండట టాపర్‌గా నిలిచింది. ఎస్ఎస్‌వైవీఎన్ పాఠ శాలకు చెందిన విద్యార్థులు గౌతమ్‌నాయక్ 583 మార్కులు, నిర్వాణశ్రీ 578, స్ఫూర్తి 570 మార్కులు సాధించారు. కోడూరు జడ్పీ పాఠశాలకు చెందిన జషిత 569 మార్కులు, చిలమ త్తూరు పొట్టిశ్రీరాములు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని శ్వేతశ్రీ 565, కొడికొండ జడ్పీ పాఠశాలకు చెందిన జైనుల్లా 560, దేమకేతేపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థి హేమంత్‌రెడ్డి 527 మార్కులు, కేజీబీవీ విద్యార్థిని జయశ్రీ 519 మార్కులు సాధించారు. అలాగే ఉర్దూ పాఠశా లలో 57.1 శాతం, సోమఘట్ట పాఠశాలలో 77.3, టేకులోడు గురుకుల పాఠశాలలో 98.7, దమకేతేపల్లి పాఠశాలలో 82.4, కోడూరు పాఠశాలలో 63.4, చిలమత్తూరు పాఠశాలలో 51.4, కేజీబీవీలో 84.2 శాతం, ఎస్ఎస్‌వైవీఎన్ పాఠశాలలో 93 శాతం ఉత్తీర్ణత సాధించారు.



రామాంజినేయులు (585) దర్శన్ (585) అనూష (572)

రొద్దం: మండలంలోని ఎంజేపీ పాఠశాల విద్యార్థి రామాంజినేయులు, తురకలాపట్నం జడ్పీ ఉన్నత పాఠ శాల విద్యార్థి దర్శన్ 585 మార్కులతో టాపర్లుగా నిలిచారు. తరువాతి స్థానంలో రొద్దం కేజీబీవీ విద్యార్థిని అనూష, జయశంకర్ కోగిర జడ్పీ పాఠశాల విద్యార్థి 572 మార్కులు చొప్పున సాధించారు. స్థానిక కేజీబీవీలో 40మందికి గాను 40మంది ఉత్తీర్ణులు కాగా పాఠశాల మొదటి ఇస్థానంలో అనూష(572) నిలిచింది. 13మంది విద్యార్థినులు 500కు పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ తెలిపారు. పలు పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కేజీబీవీ విద్యార్థి అనూష(572), కోగిర పాఠశాల విద్యార్థి జయశంకర్ (572), తురకలాపట్నం విద్యార్థి దర్శన్ (585), ఎంజేపీ విద్యార్థి రామాంజినేయులు (585), మండల స్థాయిలో 12పాఠశాలలకు సంబంధించి 86.7శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ జయభాస్కర్ తెలిపారు.

లేపాక్షి : మండలవ్యాప్తంగా 557మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 440మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు. ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న విద్యార్థి సాయికిరణ్, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థి యువ రాజ్ 581 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచినట్లు ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా 80.61శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.



కార్తీక్ (582) వెంకటగిరిపాళ్యం

పెనుకొండ రూరల్: మండలవ్యాప్తంగా 146మంది విద్యార్థులకు గాను 114మంది ఉత్తీర్ణులైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. మండలంలోని గుట్టూరు జడ్పీహెచ్ఎస్‌లో 59 మందికి గాను 41మంది, వెంకటగిరిపాళ్యంలో 42మందికి 35మంది, మావటూరులో 29మందికి 25మంది, రాంపురంలో 16మందికిగాను 13మంది ఉత్తీర్ణత సాధించారు.

అగళి : మండలంలోని వివిధ పాఠశాలలకు సంబంధించి మొత్తం 313మంది విద్యార్థు లు పరీక్షలు రాయగా అందులో 236మం ది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు తెలిపా రు. మోడల్ పాఠశాల విద్యార్థి పీ దర్శన్ 564 మార్కులతో మండలతో టాపర్‌గా, అగళి ఉన్నత పాఠశాల విద్యార్థిని గౌసియ 562 మార్కుల ద్వితీయ స్థానంలో నిలిచారు. మండల వ్యాప్తంగా 75శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

మడకశిర రూరల్: మండలం నుంచి పరీక్షలు రాసిన 1063 మంది విద్యార్థులగాను 895 మంది ఉత్తీర్ణతతో 84.19 శాతం సాధించినట్లు ఎంఈఓ భాస్కర్ ప్రకటనలో తెలిపారు.

రొళ్ల: అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఎం చరణ్ పదోతరగతి పరీక్షల్లో 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. రొళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న చంద్రశ్రీ 567 మార్కులతో రెండో స్థానంలో, కేజీబీవీ విద్యార్థిని ఐశ్వర్య 651 మార్కులతో మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. మండల వ్యాప్తంగా 74.69 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.

గుడిబండ : మండలంలోని పలువురు విద్యార్థులు పది ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచినట్లు ఎంఈఓ లు గంగప్ప, రవిచంద్ర తెలిపారు. స్థానిక మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాల విద్యార్థులు జిల్లాలోనే మంచి ప్రతిభ కనబరిచారు. 600మార్కులకుగాను జీ గోపిక 596 మార్కులు, యామిని 588, మందపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మధుమతి 586 మార్కులు సాధించారు. కేఎన్‌పల్లి పాఠశాలలో 46కుగాను 27మం ది, రాళ్లపల్లిలో 75మంది కిగాను 54మంది, జమ్ములబండ 45కు 33మంది, గుడిబండ 79మందికి 57మంది, మోరుబాగల్ 96కు 66, మద్దనకుంట పాఠశాలలో 15 మందికి 13 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే కేకే పాళ్యం లో 27కు 22, సీసీగిరి 28కు 19మంది, మందలపల్లి 61కుగాను 45మంది, ఎస్ రాయాపురం 20మందికిగాను 16, కేజీబీవీ 35కు 28మంది, ఎంజేపీ 77కు 77మంది, రవీంద్ర పాఠశాలలో 33కు 33మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ గంగప్ప, రవిచంద్ర తెలిపారు.

టీడీపీతోనే వడ్డెర్ల అభివృద్ధి : సవిత



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి సవిత

గోరంట్ల, ఏప్రిల్ 22: వడ్డెర సామాజిక వర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని టీడీపీ కూటమి పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. గోరంట్ల లోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం వడ్డెర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట ఆంజనప్ప, రాష్ట్ర వడ్డెర సాధికార కమిటీ కన్వీనర్ వడ్డె వెంకట్, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవెళ్ల మురళి హాజరయ్యారు. వడ్డెర్లను మొదట గుర్తించింది టీడీపీనే అని, గతంలో వడ్డెర్ల అభివృద్ధికి చంద్రబాబు రూ. 132కోట్లు మంజూరు చేశారని మురళి తెలిపారు. వడ్డెర్లపై దాడులు, దౌర్జాన్యలు జరిగినప్పుడు టీడీపీ అండగా నిలిచి కాపాడిందని వడ్డె వెంకట్ తెలిపారు. ఎన్డీఏ కూటమి విడుదల చేసిన బీసీ డిక్లరేషన్‌ద్వారా వడ్డెర్లకు అనేక ప్రయోజ నాలు చేకూరతాయన్నారు. వడ్డెర్లను ఆదరించేది చంద్రబాబే అని, మన హక్కుల సాధనకోసం మనమంతా టీడీపీ వెంట నడవాలని కొల్లకుంట ఆంజనప్ప పేర్కొన్నారు. అనంతరం సవిత మా ట్లాడుతూ.. వడ్డెర సామాజిక వర్గం వారితో తనకు అవినాభావ సంబంధాలున్నాయని, కంకర మిల్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ సర్పంచ్‌లు, కార్పొరేషన్ చైర్మన్లు ఉండికూడా వైసీపీ పాలనలో నిధులు లేక నిలువు దోపిడికి గురయ్యారన్నారు. గత పదేళ్లు వైసీపీకి నాయకత్వ లోపం కారణంగా ఎమ్మెల్యే అభ్యర్థులుగా శంకర్‌నారాయణ, ఉషశ్రీ చరణ్‌ను, ఎంపీలుగా గోరంట్ల మాధవ్, శాంతమ్మను ఇతర ప్రాంతాలనుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గోరంట్లలో కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు, వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే గాతనను, ఎంపీగా పార్థసారథిని గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా వడిగేపల్లి, రాగిమేకలపల్లి, తాటిమేకలపల్లి, గడ్డం తండాలకు చెందిన వైసీపీ వారు పలువురు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్వీనర్ సోముశేఖర్, వడ్డెర హనుమయ్య, గోవిందురాజులు, రవీంద్ర, అశోక్, రామాంజి, రవిమోహన్, బాలక్రిష్ణ, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులున్నారు.

వైసీపీని వీడి 32 కుటుంబాలు టీడీపీలోకి..

పెనుకొండ టౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా 32కుటుంబాలు సోమవారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ కూటమి అభ్యర్థి సవిత వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సోమందేపల్లి మండలం కేతగానిచెరువులో తొమ్మిది కుటుం బాలు, గోరంట్ల మండలం వడిగేపల్లి నుంచి ఆరు, పాలసముద్రం పంచాయతీ రాగిమేకలపల్లి నుంచి 12, తాటిమేకలపల్లి నుంచి మూడు, గడ్డంతండా నుంచి రెండు కుటుంబాలు పార్టీలో చేరారు. స్థానికంగా అధికార పార్టీ వైసీపీలో నాయకులు వస్తుంటారు, దోచుకుని వెళ్తుంటారని విమర్శించారు. తమ పరిస్థితి పట్టించుకునే వారు లేరన్నారు. దీంతో స్థానికంగా ఉంటున్న సవిత చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి

గోరంట్ల, ఏప్రిల్ 22: మండలంలోని కొమ్ముల తండాకు చె ందిన బాలాజీనాయక్ (22) ద్విచక్రవాహనం ఆటో ఢీకున్న సంఘటనలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గుమ్మయ్యగారిపల్లి వద్ద ఆటో ఢీకొని అతడికి ప్రమాదం జరిగింది. బాలాజీనాయక్‌కు కాలు, చేయి విరిగి తీవ్రవంగా గాయపడగా, గోరంట్లలో చికిత్స అనంతరం హిందూపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మద్దిలేటి సోమవారం తెలిపారు.

ఓటు హక్కుపై కొవ్వొత్తులతో ర్యాలీ

పావగడ, ఏప్రిల్ 22: తాలూకా కార్యాలయం నుంచి స్వీప్ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఓటు హక్కుపై పట్టణంలో కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించారు. సమర్థవంత నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటు హక్కు ఎంతో ప్రధానమైందని తహసీల్దార్ సంతోష్‌కుమార్ తెలియజేశారు. శనివారప్ప సర్కిల్‌లో కొవ్వత్తులు వెలిగించి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పట్టణ ప్రజలతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈఓ జానకిరామ్, సీడీపీఓ సునీతా, అన్ని శాఖల అధికారులు ఉన్నారు.

నేడు బీకే నామినేషన్

పెనుకొండ, ఏప్రిల్ 22: టీడీపీ కూటమి హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా బీకే పార్థసారథి మంగళవారం ఉదయం 11 పుట్టపర్తి కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహించే భారీ ర్యాలీకి అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని పెనుకొండ మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ కన్వీనర్ రవిశంకర్, ఓ ప్రకటనలో తెలిపారు.

టీడీపీలో కష్టపడిన వారికే గుర్తింపు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, ఏప్రిల్ 22: తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి తప్పకు గుర్తింపు లభిస్తుంది అనడానికి తానే నిదర్శనమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు అన్నారు. చంద్ర బాబు కష్టపడిన వారికే భవిష్యత్తు ఇస్తారని అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. హిందూపురం పార్లమెంటు అభ్యర్థి పార్థసారథి, జిల్లా అధ్యక్షుడు అంజి నప్ప, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పే స్వామి, హిందూపురం పార్లమెంటు ఎన్నికల పరిశీల కులు పూలనాగరాజు తదితరులతో కలిసి ఎంఎస్ రాజు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడ్డారని, ఎదురొడ్డి పోరాడిన వారిపై దొంగ కేసులు నమోదు చేశారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా తనపై 62 కేసులు నమోదైనట్లు తెలిపారు. తనును నాన్‌లోకల్ అంటున్నారని, టీడీపీ కుటుంబం తనను అక్కున చేర్చుకుంటుందన్న నమ్మకంతోనే తాను ఇంతదూరం వచ్చానన్నారు. మడకశిర నియో జకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు.

తాను పోటీచేసే చివరి ఎన్నికలు : బీకే

తాను పోటీచేసే చివరి ఎన్నికలు ఇవేనని, మళ్లీ ఎన్నిక ల్లో పోటీ చేయబోనని టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. అయితే భవిష్యత్తులో టీడీపీలోనే కొనసాగుతానన్నారు. మడకశిర నియోజకవర్గంలో గతంలో 1999లో ఎంపీగా పోటీచేసిన సమయంలో సైతం తనను ఆదరించారని, అప్పట్లో ప్రతిపక్ష ఎమ్మెల్యే గెలిచినా ఈప్రాంతంలో తాను నాయకులు, కార్యకర్తల కు అండగా నిలబడ్డానన్నారు. హంద్రీనీవా కాలువ ని ర్మాణం పూర్తి చేస్తామన్న జగన్ ఒక్క తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. అనంతరం గుండుమల తిప్పే స్వామి, కొల్లకుంట అంజినప్ప, పూలనాగరాజు తదితరు లు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జిల్లా, మండల నియోజకవర్గం స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

రొద్దం, ఏప్రిల్ 22 : తల్లికి వందనం పేరుతో చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందిస్తామని టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. రొద్దం మండల పరిధిలోని తిమ్మాపురం, లక్కసానిపల్లి, చెరుకూరు, ఉప్పర్లపల్లి, రొప్పాల, పెద్దమంతూరు, బి కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం టీడీపీ మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయ కులు మాధవనాయుడు, చిన్నప్ప య్య, నరసింహులు, నరహరి, హరీష్, రాము, మాజీ సర్పంచ్ కిష్టప్ప, నాగరాజు, చౌడప్ప, హనుమప్ప, మాజీ సర్పంచ్ వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల అద్దాలు ధ్వంసం

మడకశిరటౌన్, ఏప్రిల్ 22: మడకశిర టీడీపీ అభ్యర్థి ఎం.ఎస్.రాజు రెండు వాహనాలు, హిందూ పురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథి ఒక వాహనం, ఎంఎస్ రాజుకు మద్దతు తెలపడానికి వచ్చిన బంజారా గిరిజన సమాఖ్య నాయకులకు చెందిన ఐదు వాహనాల అద్దాలను ధ్వంసం చేసినట్లు బంజారా గిరిజన సమాఖ్య అధ్యక్షుడు మహేష్ తెలి పారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని మార్పు చేయ డంతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా డాక్టర్ సునీల్‌కుమార్ నామినేషన్ దాఖలు చేసేందుకు వాల్మీకి సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంలో టీడీపీ నాయకుల వాహనాల అద్దాలను గుర్తుతెలియని వారు అద్దాలను ధ్వంసం చేశారన్నారు. దీనిపై పోలీ సులకు ఫిర్యాదు చేయనున్నట్లు మహేష్ తెలిపారు.

'బరిలోనే ఉంటా'

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 22: కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటానని వీ నాగరాజు పేర్కొన్నాడు. ఆయన సోమవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన కాంగ్రెస్ పార్టీ వాదిగా నేను బరిలో ఉంటానన్నారు.

విద్యుత్ శాఖ అత్యుత్సాహం

వైసీపీ నాయకుడి సేవకోసం... అప్రకటిత విద్యుత్ కోతలు



కరెంటు లేకపోవడంతో చెట్టు కింద సేదతీరుతున్న ప్రజలు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 22: అసలే వేసవి కాలం. ఆపై అప్రకటిక విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. పట్టణంలోని బీటీ కాలనీలో ఓ వైసీపీ నాయుడు అపార్టుమెంట్‌ను నిర్మించాడు. దానికి ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతే అనుకున్నదే తడువుగా వైసీపీ నాయకుడి సేవకు విద్యుత్ శాఖ సిద్ధమైపోయింది. దీంతో సోమవారం ఉదయం 11 గంటల నుంచి 2 దాకా మూడు గంటలు ఏకధాటిగా విద్యుత్ కోత విధించారు. దీంతో పాటు రోజంతా పలు మార్లు కరెంటు పోతూ వస్తూ ఉంది. దీంతో బీటీ కాలనీ, నానెప్పనగర్, లక్ష్మీపురం, ప్రాంతాల్లో విద్యుత్ కోతలతో ఆ ప్రాంత ప్రజలు విలవిల్లాడారు. ఇళ్లలో ఉండలేక చెట్ల కింద కూర్చుని సేదతీరారు. సాధారణంగా ప్రతి శనివారం మెయింటేనెన్స్ పేరుతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట దాకా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఆ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని ఉండాల్సింది. అలా కాకుండా విద్యుత్ శాఖ అధికారులు అత్యుత్సాహంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

చిలమత్తూరు, ఏప్రిల్ 22: హిందూపురం నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సమక్షంలో స్థానిక టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం వైసీపీకి చెందిన వంద ఎస్సీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. చిలమత్తూరు ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా నాగరాజు యాదవ్‌తో చర్చించి పార్టీలోకి వస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి వారందరినీ సాదరంగా పార్టీలోకి అహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బేవనహళ్లి ఆనంద్, బేకరీ గంగాధర్, ఆటో సజ్జప్ప ఉన్నారు.

42 మంది వలంటీర్ల రాజీనామా

మడకశిర రూరల్, ఏప్రిల్ 22: మండలంలోని కల్లుమర్రి,మణూరు,హరేసుముద్రం-1 హరేసుముద్రం -2 గ్రామ సచివాలయాలకు సంబంధించి 42 మంది వలంటీర్ల సోమవారం రాజీనామా చేశారు. వారి రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ దాసరి మేరీకి అందజేశారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత



శాంతన్ మోహిత్ అక్షయ దివ్యబాయి ఖతీజజావ్య

బాబాఫక్రుద్దీన్ సుహాసిని ఉమైశ అల్మాస్ యశ్వంత్ భవితశ్రీ

బిందు త్రిష రేణుక మౌనిక నిహారిక

పెనుకొండ, ఏప్రిల్ 22 : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఈ యేడాది పెనుకొండ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర విద్యాశాఖ సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 62మంది విద్యార్థులకు 33మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో బోయ ప్రవీణ్‌కుమార్ 563, మోదా రాజేష్‌నాయక్ 542, మంజుళమణి 508మార్కులు సాధించారు. బాలికల ఉన్నత పాఠశాలలో 88మందికిగాను 79మంది ఉత్తీర్ణులయ్యారు. అందులో దివ్యబాయి 562, వైశాలి 560, ప్రీతిక 533మార్కులు సాధించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 21మందికిగాను 18 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో హేమంత్‌కుమార్ 499, లౌకిక, వరూధన్ 376, ముజమ్మిల్ 319 సాధించారు. ఏపీఎస్టీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో 38మందికి గాను 31మంది ఉత్తీర్ణత సాధించారు. త్రిశ 550, మౌనికబాయి 535, రేణుకాబాయి 512మార్కులు సాధించారు. ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో 23మందికిగాను 20మంది ఉత్తీర్ణత సాధించారు. సోఫియాబాను 484, షేక్ ఆలియాసుల్తానా 475, పఠాన్ తస్నీయ 472మార్కులు సాధించారు. స్థానిక ప్రగతి గ్లోబుల్‌జెన్ పాఠశాలలో 34మందికిగాను 34మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో శాంతన్ 594 మార్కులతో జిల్లాలో 6వ స్థానంలో ఉత్తీర్ణత సాధించారు. మోహిత 585, అక్షయ 577 మార్కులు సాధించారు. ప్రగతి పాఠశాలలో 32మందికిగాను 31మంది ఉత్తీర్ణత సాధించారు. ఆర్యన్ 565, రాజశేఖర్‌రెడ్డి 547, హబీబ్‌ఖాన్ 545 సాధించారు. సిద్దార్థ పాఠశాలలో 23మందికి 23మంది ఉత్తీర్ణత సాధించారు. లహరి 585, కీర్తిసాయిక్రిష్ణ 572, మేఘన 570మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. శాంతినికేతన్ పాఠశాలలో 37మందికి 36మంది ఉత్తీర్ణత సాధించారు. హాసిని 588, బాబాఫక్రుద్దీన్ 588, అల్మాస్ 586మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఘనగిరి ఇంగ్లీష్ పాఠశాలకుగాను 16మందికి 16మంది ఉత్తీర్ణత సాధించారు. ఖతిజ జావ్వి 587, బ్రిలియన్స్ పాఠశాలలో 23మందికి 22మంది ఉత్తీర్ణత సాధించారు. యశ్విత 583, భవితశ్రీ 577, బిందు 570తో ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో 77శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రైవేట్ పాఠశాలల్లో 98శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి

ఎస్పీ మాధవరెడ్డి



నాగలూరు గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 22: ఎన్నికల్లో తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని పోలీ సులు ఎల్లవేళలా అండగా ఉంటారని శ్రీసత్యసాయిజిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగలూరు గ్రామాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమై ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు పాల్పడకుండా తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని గ్రామస్థులను హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. మెయిన్ స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను తరలించాక ఎలాంటి భద్రత కల్పించాలి అనే విషయాలను పోలీసులతో సమీక్షించారు. నామినేషన్ కేంద్రాలవద్ద అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో తీసుకునే జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబిజాన్‌సైదు, సీఐ యుగందర్, ఎస్ఐలు రాజేష్, రంగడు తదితరులు పాల్గొన్నారు.